Follow: @ANNTELUGU

ANN తెలుగు

10-11-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 322 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు 50 వేల మెజారిటీ పక్కా

### బీఆర్ఎస్ పొర్లు దండాలు పెట్టినా గెలుపు నవీన్ దే


ప్రెస్ మీట్ లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, జూపల్లి, పొన్నంతో కలిసి సమావేశం

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేతలు పొర్లు దండాలు పెట్టిన గెలిచేది మాత్రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థే అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించబోతున్నారని వెల్లడించారు. నవీన్ యాదవ్ 30 నుంచి 50 వేల ఓట్ల మెజారిటీతో గెలువబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు.

మిగతా 2లో

టాప్ న్యూస్



### రాముడి వారసులు కావాలా?

- ఔరంగజేబు వారసులు కావాలా?
- కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- హిందూ ఓటర్లకు డబ్బులు కూడా ఇవ్వట్లేదు


02



### ఇక నెక్స్ట్ ఖైరతాబాద్ బై ఎలక్షన్

- పీజేఆర్ కూతురు హింట్

02



### హరీష్ రావు బినామీ

- వరంగల్ ఆస్పత్రి కాంట్రాక్టర్
- అందుకే అంచనాలు రూ.1100 కోట్ల నుండి 1700 కోట్లకు పెంపు
- విజిలెన్స్ విచారణలు జరిపించినా చర్యలు తీసుకోవడం లేదు
- ఆయనపై తప్పు అందరిపై కేసులు నమోదవుతున్నాయి
- హరీష్ రావుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ఆరోపణలు

02



### 66666666.. రంజీ ట్రోఫీలో వరుసగా 8 సిక్స్‌లు

#### మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ వరల్డ్ రికార్డు

**మహా:** రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో అరుదైన రికార్డు నమోదైంది. మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ కుమార్ చౌదరి.. ఫస్ట్ క్లాస్ క్రికెట్ చరిత్రలోనే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ కొట్టాడు. ప్లేట్ గ్రూప్ మ్యాచ్‌లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు ఈ ఫీట్ సాధించాడు. కేవలం 11 బంతుల్లోనే 50 పరుగుల మార్కును చేరుకున్నాడు. వరుసగా 8 సిక్సర్లు బాది.. ఔరా అనిపించాడు. దీంతో ఆకాశ్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ క్రమంలోనే వేన్ వైట్ రికార్డును బ్రేక్ చేశాడు. లీసెస్టర్‌షైర్ ఆటగాడైన వేన్ వైట్ 2012లో 12 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించాడు. తాజాగా అది బద్దలైంది.

### ముగిసిన బీహార్ ఎన్నికల ప్రచారం

#### రేపే తుదివిడత పోలింగ్

**మహా:** బీహార్‌లో రెండో విడత ఎన్నికల ప్రచారం ముగిసింది. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీకి ఈ నెల 11న 20 జిల్లాల పరిధిలోని మిగతా 122 సీట్లకు ఓటింగ్ జరగనుంది. ఈనెల 6న 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో తొలిదశ పోలింగ్ జరిగింది. ఈసారి అధికార ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ మధ్య గట్టిపోటీ నెలకొంది. రెండో దశ పోలింగ్‌లో 3 కోట్ల 70 లక్షలకు పైగా ఓటర్లు 1,302 మంది అభ్యర్థులు భవితవ్యాన్ని తేల్చనున్నారు. నవంబర్ 6న 121 స్థానాలకు జరిగిన మొదటి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 65 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. కనుక ఇప్పుడు రెండో దశ పోలింగ్ పై అందరి దృష్టి ఉంది.

### కాంగ్రెస్

**ప్లస్ పాయింట్స్**

- స్థానిక అభ్యర్థి
- కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్మాత్మకంగా తీసుకోవడం
- ఎంఐఎం, సీపీఐ, టిజెఎస్ ఇతర పక్షాల మద్దతు
- మంత్రులు, ఎమ్మెల్యేల ప్రచారం.. డివిజన్లపై పట్టు
- పోల్ మేనేజ్ మెంట్
- చివరి ఐదురోజుల ప్రచారం, వ్యూహాలు

**మైనస్ పాయింట్స్**

- మొదట్లో సోషల్ మీడియాలో వెనుకబడడం
- బీఆర్ఎస్ వ్యూహాలకు మొదట్లోనే సరిగ్గా కౌంటర్ చేయకపోవడం
- దివంగత ఎమ్మెల్యే ఇక్కడ వరుసగా మూడుసార్లు గెలిచిఉండడం



# కాంగ్రెస్ వైపే మొగ్గు

## జూబ్లీహిల్స్‌లో పబ్లిక్ పల్స్

### అందరి నోటా అదే మాట

### ఆఖర్లో పుంజుకున్న కాంగ్రెస్

20 వేలకు పైగా ఆధిక్యం ఖాయమని నేతల ధీమా

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్.. మంత్రులు

ఫలించిన అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు

రేపే పోలింగ్.. ఆఖరి మంత్రాంగమే కీలకం

**హైదరాబాద్ - మహా:** జూబ్లీహిల్స్ బైపోల్ పోలింగ్ మరికొన్ని గంటల్లో జరగనుంది. ప్రచారాన్ని మూడు అగ్రపార్టీలు అదరగొట్టగా, ప్రధానంగా అధికార కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. జూబ్లీహిల్స్ లో షేక్ పేట, బోరబండ, రెహమత్ నగర్, యూసుఫ్ గూడ, వెంగళరావునగర్, శ్రీనగర్ కాలనీ, ఎర్రగడ్డ డివిజన్లు ఉండగా.. కాంగ్రెస్ పకడ్బందీ వ్యూహాలు, పోల్ మేనేజ్ మెంట్ ఫలించినట్లు కనబడుతోంది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తొలిసారి ఈ జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యం కనినిస్తోంది. ఏడు డివిజన్లలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించగా, రోడ్ షోలు హిట్టయ్యాయి. మరోవైపు మంత్రులు, ఎమ్మెల్యేలను ఇన్ ఛార్జిలుగా నియమించి సీఎం రేవంత్ రెడ్డి అమలుచేసిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో ఇన్ ఛార్జి మంత్రులు, ఎమ్మెల్యేలంతా ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో చివరి ఐదురోజుల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. దీంతో ఎక్కడ చూసినా కాంగ్రెస్ మాట వినబడుతోంది.

మిగతా 2లో

### బీఆర్ఎస్

**ప్లస్ పాయింట్స్**

- దివంగత ఎమ్మెల్యే భార్యను అభ్యర్థిగా నిలపడం
- సోషల్ మీడియాను, ప్రధాన మీడియాను బలంగా వాడడం
- కేటీఆర్ ప్రచారం

**మైనస్ పాయింట్స్**

- పదేళ్ళు అధికారంలో ఉన్నా జూబ్లీహిల్స్ లో పెద్దగా ప్రగతి లేకపోవడం
- అభ్యర్థి కుటుంబంలో తగాదాలు
- ఎంఐఎం కాంగ్రెస్ కు మద్దతు ఇవ్వడం
- కేసీఆర్ ప్రచారానికి దూరంగా ఉండడం

### బీజేపీ

**ప్లస్ పాయింట్స్**

- లోక్ సభ ఎన్నికల్లో ఈ నియోజక వర్గంలో గణనీయ ఓట్ల సాధన
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నియోజకవర్గం కావడం
- చివర్లో బండి సంజయ్ ప్రచారం

**మైనస్ పాయింట్స్**

- బీజేపీ ఎన్నికను సీరియస్ గా తీసుకోలేదన్న భావన
- అభ్యర్థి ఎంపికలో జాప్యం
- మిగతా 2 పార్టీలతో పోలిస్తే అభ్యర్థి ఎంపికలో వ్యూహం లేకపోవడం

# రాసి పెట్టుకోండి

### 2034 వరకు మాదే అధికారం.. వచ్చే ఎన్నికలు 2029 జూన్‌లో

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

కేటీఆర్ అరెస్టు కోసం గవర్నర్ అనుమతి కోరాం

బీజేపీ, బీఆర్ఎస్ విలీనాన్ని తాను అడ్డుకున్నానని కవితే చెప్పారు

కేటీఆర్ ప్రచారం.. శ్రీలీల ఐటమ్ సాంగ్ లాంటిది

మీట్ ది ప్రెస్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** రాసిపెట్టుకోండి.. 2034 దాకా అధికారం మాదే. 2023 నుంచి పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పథకాలను కొనసాగిస్తూ అదనంగా అనేక కొత్త పథకాలు తెచ్చానని తెలిపారు. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణాలో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో ఎంత మెజారిటీతో గెలుస్తామో చెప్పలేమన్నారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీ డిపాజిట్ కోల్పోవడం ఖాయమని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ విలీనాన్ని తాను అడ్డుకున్నానని కవితే చెప్పారు కదా అని రేవంత్ గుర్తుచేశారు. ఉపఎన్నికల్లో పోటీ పెట్టే విషసంస్కృతిని తీసుకొచ్చిందే కేసీఆర్ అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఫేక్ సర్వేలకు మీడియా దయచేసి ప్రాధాన్యం ఇవ్వొద్దని కోరారు.



**ఎన్నికలు అపుడే**

"బీజేపీ, బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ తెచ్చుకుంటే బీజేపీ దేశం మొత్తం గెలిచినట్లే. మరో 8 ఏళ్లు మేమే అధికారంలో ఉంటాం. 2028 డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు రావు. 2029 జూన్‌లో జమిలి ఎన్నికలు వస్తాయి.

మిగతా 2లో

## గోపీనాథ్ మరణంపై విచారణ జరపాలి

### కేటీఆర్ వచ్చాకే మరణవార్తను బయటకు చెప్పారు

ఆయన ఎప్పుడు చనిపోయారన్నది తల్లిగా నాకే తెలీదు

గోపీనాథ్ తల్లి మహానంద కుమారి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై ఆయన తల్లి మహానంద కుమారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గోపీనాథ్ మరణం మిస్టరీగా అనిపిస్తోందని, తమకు అనుమానాలున్నాయని అన్నారు. ఆయన ఎప్పుడు చనిపోయారన్నది తల్లిగా తనకే తెలీదన్నారు. 'జూన్ 6న చనిపోయారా.. 8న చనిపోయారా?' అన్నదీ సందేహంగానే ఉందన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాగంటి మొదటి భార్య మాలిని, ఆమె కుమారుడు తారక్‌తో కలిసి మహానంద కుమారి మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో





### మోదీ సామ్రాజ్యంపై మా పోరాటం

- బ్రిటిషర్లపై గాంధీజీ చేసిన యుద్ధం లాంటిదే ఇది
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాట్ కామెంట్స్

02

### హైదరాబాద్‌లో భారీ ఉగ్రకుట్ర భగ్నం

- గుజరాత్‌లో ముగ్గురు ఉగ్రవాద అనుమానితుల అరెస్ట్
- పట్టుబడ్డ వారిలో ఇద్దరు యూపీ వారు కాగా మరొకరు హైదరాబాద్ వాసి
- ఎంబీబీఎస్ పూర్తి చేసిన హైదరాబాద్ కు చెందిన మోహియుద్దీన్



02

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధం

- ప్రచారానికి తెర .. రేపే పోలింగ్
- 407 పోలింగ్ కేంద్రాలు.. అమల్లోకి 144 సెక్షన్


03

### బస్సులో బిగ్ బాస్

#### డ్రైవర్ పై నెటిజన్ల ఫైర్

**మహా :** హైవేలపై రోడ్డు ప్రమాదాలు కలవరపెడుతున్న వేళ.. ఓ బస్సు డ్రైవర్ చేసిన ఘనకార్యం సోషల్ మీడియాలో ట్రెండింగ్ గా మారింది. నెటిజన్లు ఆ డ్రైవర్ ను తిట్టిపోస్తున్నారు. ఇంతకూ ఆ వీడియోలో ఏముందంటే.. ఓ బస్సు డ్రైవర్ రాత్రిపూట చిమ్మ చీకట్లో బస్సు నడుపుతూ తన

మిగతా 2లో







# ఇక నెక్స్ట్ ఖైరతాబాద్ బై ఎలక్షన్

## పీజేఆర్ కూతురు హింట్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ గెలవబోతోందని పీజేఆర్ కూతురు విజయారెడ్డి అన్నారు. నెక్స్ట్ ఖైరతాబాద్ కు ఉప ఎన్నిక రాబోతోందని అక్కడ మీరే బరిలోకి దిగి విజయం సాధించబోతున్నారా అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నపై విజయారెడ్డి స్పందించారు. పీజేఆర్ మార్క్ ప్రతి చోట ఉందని తాము కూడా పీజేఆర్ వారసులమనే కాకుండా ప్రజలతో మమేకం అవుతూ వారితో ఉంటున్నామన్నారు. గత ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి తనకు అవకాశం ఇచ్చారని అప్పటి పరిస్థితులు వేరు ఇప్పుడు పరిస్థితులు వేరని చెప్పారు. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. ఖైరతాబాద్ బైపోల్ పై చాలా కాలంగా ప్రచారం ఉండగా, జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ విజయం సాధిస్తే ఖైరతాబాద్ కు రంగం సిద్ధమైనట్లేనన్న చర్చ ఉంది. బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ ఎంపీగా కాంగ్రెస్ నుండి పోటీచేయడంతో బైపోల్ పై రాజకీయవర్గాలు నమ్మకంగా ఉన్నాయి.

# గోపీనాథ్ మరణంపై విచారణ జరపాలి

## కేటీఆర్ వచ్చాకే మరణవార్తను బయటకు చెప్పారు

### ఆయన ఎప్పుడు చనిపోయారన్నది తల్లిగా నాకే తెలీదు .. గోపీనాథ్ తల్లి మహానంద కుమారి సంచలన వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

'కేటీఆర్ వచ్చిన తర్వాత మరణవార్తను బయటకు చెప్పారు. గోపీనాథ్ 3 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై గొప్ప పేరు తెచ్చుకున్నారు. అలాంటి వ్యక్తి ఆస్పత్రిలో ఉంటే.. ఒక్క రోజు కూడా చూడటానికి టైమ్ ఇవ్వలేదు. ఒక్క అటెండర్‌ను కూడా పెట్టలేదు. గోపీనాథ్ జూన్ 8న చనిపోయారని చెప్పారు. లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మొదటి భార్య, బిడ్డలు, నా పేరు కూడా లేదు. మొదటి భార్యతో విడాకులు కూడా కాలేదు. నేను గోపీనాథ్‌తో సునీత పెళ్లి చేయలేదు. ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో మా పేరు లేదు. కేటీఆర్ వెంట పరుగెత్తి నాకు జరిగిన అన్యాయం గురించి చెప్పాలి అనుకుంటే ఆయన కూడా వినలేదు. ఇది డబ్బు సమస్య కాదు. మాకు గుర్తింపు లేదు. అందుకే మీడియా ముందుకొచ్చాం. తల్లిగా ఎంతో బాధపడుతున్నా. గోపీనాథ్ తల్లిగా కేటీఆర్ తనను కనీసం కలవలేదు, సునీతకు టికెట్ ఇచ్చేటప్పుడు కేటీఆర్ మాకు కనీసం సమాచారం ఇవ్వలేదు. నాకు 93 ఏళ్ల వయసులో ఇలా బయటకు రావడం బాధగా ఉంది. మాకు ఏ పార్టీతో సంబంధం లేదు. మాకు అన్యాయం జరిగింది. గోపీనాథ్ మొదటి భార్య, కుమారుడికి గుర్తింపు ఉండాలి కదా. మాలిని ఎంతో బాధపడుతోంది. ఎన్నో అవమానాలు పడింది. వద్దు అనుకుంటే మొదటి భార్యతో ఎప్పుడో విడాకులు తీసుకునేవాడు. అలా జరగలేదు అంటే.. సాఫ్ట్ కార్నర్ ఉన్నట్లే కదా. నలుగురిలో నిరూపించుకోవాలనే బయటకు వచ్చాం. నా పెద్ద కొడుకు కూడా టికెట్ కోసం ప్రయత్నించాడు. గోపీనాథ్ తల్లిగా నాకు అడగాల్సిన హక్కులేదా? లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మా పేర్లు లేవని ఆగస్టు 11 నుంచి తహసీల్దార్ కార్యాయానికి వెళ్లి వస్తున్నాం. ఈ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు'' అని అన్నారు.



**మాకు గుర్తింపు లేదు.. తారక్ ప్రద్యుమ్న**

'నా పాస్‌పోర్ట్, ఇతర పత్రాల్లో తండ్రిగా గోపీనాథ్ పేరే ఉంది. చట్ట పరంగా కూడా అన్ని సక్రమంగా ఉన్నాయి. ఎంఆర్ఓ ఆఫీస్ లో కూడా సబ్మిట్ చేశాను. మా అమ్మతో చట్టపరంగా విడాకులు కాలేదు. తారక్ అంటే ఎవరో తెలియదన్న మాగంటి సునీత.. జూన్ 6న నాకు మొదటి సారి ఫోన్ చేశారు. ఎవరో తెలియకపోతే.. ఎందుకు ఫోన్ చేసినట్లు? గ్రాడ్యుయేషన్ డేకి రావాలని మా నాన్న అనుకున్నారు. కానీ, హఠాత్తుగా చనిపోయారు. సునీత నాకు ఫోన్ చేసి.. నువ్వు ఇండియా రావాల్సిన అవసరం లేదు. రెజ్యూమె పంపించు కేటీఆర్ అంకుల్ కంపెనీస్‌లో ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. మా పెద్దనాన్న మీద అనవసర ఆరోపణలు చేస్తున్నారు. జూన్ 25న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం అప్లై చేశారు. అప్పుడు అఫిడవిట్‌లో ఎవరి పేర్లు పెట్టారో నాకు తెలియదు. మా అమ్మ, నాన్నమ్మ, నా పేర్లను లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో పెట్టాలి' అని కోరారు.

### వరంగల్ ఆస్పత్రి కాంట్రాక్టర్

# హరీష్ రావు బినామీ

## అందుకే అంచనాలు రూ.1100కోట్ల నుండి 1700కోట్లకు పెంపు

విజిలెన్స్ విచారణలు జరిపించినా చర్యలు తీసుకోవడం లేదు

ఆయనపై తప్ప అందరిపై కేసులు నమోదవుతున్నాయి

హరీష్ రావుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ఆరోపణలు



**వరంగల్, మహా:** తెలంగాణ వ్యాప్తంగా యాత్ర చేస్తున్న కవిత బీఆర్ఎస్ పై, హరీష్ రావుపై తన ఆరోపణలు కొనసాగిస్తున్నారు. తాజాగా వరంగల్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా హరీష్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. వరంగల్ లో బీఆర్ఎస్ హయాంలో భారీ ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆ ఆస్పత్రి నిర్మిస్తోంది హరీష్ రావు బినామీనేనని కవిత ఆరోపించారు. అందుకే రూ.1100కోట్ల నుండి రూ.1700కోట్లకు అంచనాలు పెంచారని, విజిలెన్స్ విచారణలు జరిపించినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కవిత ప్రశ్నించారు. గతంలో హరీష్‌రావుకు, రేవంత్ కు మధ్య డీల్ ఉందని కవిత ఆరోపణలు చేశారు. హరీష్‌రావుపై తప్ప అందరిపై కేసులు నమోదవుతున్నాయన్నారు. ఇప్పుడు అవే అనుమానాలను వరంగల్ ఆస్పత్రి విషయంలోనూ వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా బీఆర్ఎస్ లో పని చేస్తే.. కనీసం షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా నన్ను అవమానకరంగా బయటికి పంపించారని, తాను పక్కా పాలిటిక్స్ చేస్తానని ఆడబిడ్డలు రాజకీయం చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.

**పొలిటికల్ గా బీఆర్ఎస్ తో ఎలాంటి సంబంధం లేదు**

పాలక పక్షం, ప్రతిపక్షం పని చేయడం లేదు. ప్రభుత్వాన్ని అడిగే పని జాగృతి చేస్తుందని తెలిపారు. టీఆర్ఎస్ లో నన్ను ప్రోటోకల్ పేరుతో నిజామాబాద్ కి కట్టడి చేశారని, టీచర్ ను ట్రాన్స్ఫర్ చేసుకునే పరిస్థితి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవనాన్ని రూ 11 వందల నుంచి 1700 కోట్లకు పెంచారని, దీని పై విజిలెన్స్ విచారణ వేసి ప్రభుత్వం ఎందుకు నివేదిక తెప్పించుకుని చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నేడు రాష్ట్రంలో నేడు పాలకపక్షం, ప్రతిపక్షం జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిజీగా ఉంది. ప్రజల తరపున అడిగేటోళ్లు లేరు. అందుకే మేము ఆ పని చేస్తున్నామని కవిత వెల్లడించారు. బీసీలకు చట్టసభల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలుగా అవకాశం రావాలన్నదే నా లక్ష్యమని పేర్కొన్నారు. పొలిటికల్ గా బీఆర్ఎస్ తో నాకు ఎలాంటి సంబంధం లేదని కవిత చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో వరంగల్ జిల్లా పాత్ర మరువలేనిదని, ఉద్యమానికి ఎంతో స్ఫూర్తినిచ్చిన జిల్లా అని చెప్పారు.

# బస్సులో బిగ్ బాస్

## డ్రైవర్ పై నెటిజన్ల ఫైర్



(మొదటిపేజీ తరువాయి)

ఫోన్‌లో బిగ్‌బాస్ షో చూడటం కనిపిస్తుంది. ఓ వైపు బస్సును హైస్పీడ్‌తో నడుపుతూ ఫోన్‌లో డ్రైవర్ వీడియో చూస్తుండటం కనిపిస్తుంది. సదరు బస్సు ముంబై నుంచి హైదరాబాద్‌కు వెళ్తోంది. తెల్లవారు జామున 2 గంటల సమయంలో బస్సు డ్రైవర్ ఓ చేత్తో స్టీరింగ్ పట్టుకుని తిప్పుతూ.. మరో చేత్తో ఫోన్ పట్టుకుని బిగ్‌బాస్ షో చూస్తూ కనిపించాడు. ఆ సమయంలో బస్సు గంటకు 80 కిలోమీటర్ల వేగంతో వెళ్లం కూడా వీడియోలో కనిపిస్తుంది. ఇక అదే బస్సులో ఉన్న ఓ ప్రయాణికుడు డోర్ వద్దకు వెళ్లి, డ్రైవర్ భాగోతాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు బస్సు డ్రైవర్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల భద్రత గురించి ఏ మాత్రం బాధ్యత లేకుండా నిర్లక్ష్యంగా బస్సు నడుపుతున్న సదరు బస్సు డ్రైవర్‌ను తిట్టిపోస్తున్నారు. కర్నూలు సంఘటన జరిగిన సమయంలోనే ఇది కూడా జరగ్గా, ఇపుడు ఈ వీడియో వెలుగులోకి వచ్చింది.

# కాంగ్రెస్ వైపే మొగ్గు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల నిర్వహణలో సిద్ధహస్తులుగా పేరున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ లతో పాటు హేమాహేమీల్లాంటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, హైదరాబాద్ మంత్రి పొన్నం ప్రభాకర్, తుమ్మల లాంటి నేతలంతా బాగా కష్టపడ్డారు. ఫలితం కనబడుతోంది. మొదట్లో గులాబీపార్టీ జోరు చూసి ఆందోళన చెందిన కాంగ్రెస్ తమ పనితీరుతో, వ్యూహాలతో నియోజకవర్గాన్ని చేతికి చిక్కించుకుంది. మంగళవారం జరిగే పోలింగ్ కీలకంగా మారనుంది. 50శాతానికి పైగా పోలింగ్ జరుగుతుందని భావిస్తుండగా, కనీసం 20వేల ఆధిక్యం వస్తుందని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. చివర్లో సీఎం ప్రచారం, ప్రెస్ మీట్లు, మీట్ ది ప్రెస్ కూడా జూబ్లీహిల్స్ ప్రచారంపై పాజిటివ్ వాతావరణం తీసుకొచ్చాయి. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం, ఈ టర్మ్ మరో మూడేళ్ళు ఉండడం ప్లస్ పాయింట్ గా మారింది. కాంగ్రెస్ పార్టీ స్థానికుడైన బీసీ అభ్యర్థిని అభ్యర్థిగా ఎంపికచేయగా, బీఆర్ఎస్, బీజేపీలు జనరల్ అభ్యర్థులనే నమ్ముకున్నాయి.

**రేపే పోలింగ్**

మంగళవారం పోలింగ్ జరగనుండగా, ఆఖరి రోజు మూడు ప్రధానపార్టీలు ప్రచారంలో అదరగొట్టాయి, సీఎం రేవంత్ మీట్ ది ప్రెస్ ద్వారా మరోసారి ప్రజలకు విజ్ఞప్తి చేయగా, నియోజకవర్గంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, పొన్నం, వివేక్, శ్రీధర్ బాబు, సీతక్క సహా నేతలంతా ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ తరుపున కేటీఆర్ అన్నీ తానై ప్రచారం చేయగా, హరీష్‌రావు, ఇతర మాజీ మంత్రులు ఫోకస్ పెట్టారు. బిజెపి తరుపున కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండిసంజయ్, బిజెపి చీఫ్ రామచంద్రరావులు ప్రచారం చేశారు.

### రాముడి వారసులు కావాలా? ఔరంగజేబు వారసులు కావాలా?

- కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- హిందూ ఓటర్లకు డబ్బులు కూడా ఇవ్వట్లేదు

**హైదరాబాద్, మహా:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎన్నికల్లో రాముడి వారసులుగా మేము వస్తుంటే ఔరంగజేబు వారసులుగా కాంగ్రెస్ పార్టీ వాళ్లు వస్తున్నారని.. రాముడి వారసులు కావాలా? ఔరంగజేబు వారసులు కావాలా జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ బైపోల్‌లో శ్రీరాముడి దమ్మేంటో, హిందూ ఓటు బ్యాంకు దమ్ము ఏంటో చూపించాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆఖరిరోజు ఆదివారం జూబ్లీహిల్స్ ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ముస్లింల గురించి ఓ వైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ మాట్లాడుతుంటే హిందువులంతా చేతులు కట్టుకుని కూర్చోవాలా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికలో గెలిచేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కేవలం ముస్లిం ఓటర్లకే డబ్బులు పంచుతూ కనీసం హిందువుల ఇండ్లకు వెళ్లి కనీసం వారి బాధలు కూడా వినడం లేదని ఆరోపించారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు 50 వేల మెజారిటీ పక్కా

## బీఆర్ఎస్ పొర్లు దండాలు పెట్టినా గెలుపు నవీన్ దే

### ప్రెస్ మీట్ లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, జూపల్లి, పొన్నంతో కలిసి సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

జూబ్లీ హిల్స్ ప్రజల కష్టాలు పంచుకునే నాయకుడు నవీన్ యాదవ్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసఫ్‌గూడలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఇతర ముఖ్య నేతలతో కలిసి టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ అరాచక పాలనకు.. రెండేళ్ల అభివృద్ధి పాలనకు బేరీజు వేసుకొని ప్రజలు తీర్పు ఇవ్వబోతున్నారని పేర్కొన్నారు. కొన్ని చానల్స్‌తో ఫేక్ సర్వేలు చేయించుకొని బీఆర్ఎస్ కుట్రలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిసి బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని బలి చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎన్ని కుప్పి గంతులు వేసిన ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. తమ ప్రభుత్వం జూబ్లీ హిల్స్‌లో 15 వేల రేషన్ కార్డులు ఇచ్చిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధితోపాటు సంక్షేమానికి పట్టం కట్టబోతున్నారని పేర్కొన్నారు.

**ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలే..**

రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమం చూసి విపక్షాలలో వణుకు పుడుతోందని చెప్పారు. సినీ కార్మికులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నియంతృత్వ పాలన, అవినీతి భరించ లేక అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు చీకొట్టినా ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని మండిపడ్డారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి చేసిన అభివృద్ధి జూబ్లీ హిల్స్‌లో ఎక్కడ కనిపించడం లేదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో లోపాయికారి గుట్టు.. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో సైతం నడుస్తుందన్నారు. కిషన్ రెడ్డి, కేసీఆర్ మైత్రి తెలియనిది కాదని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషనులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని స్పష్టం చేశారు. దీనికి బీజేపీ అడ్డుపడుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# మోదీ సామ్రాజ్యంపై మా పోరాటం

- బ్రిటిషర్లపై గాంధీజీ చేసిన యుద్ధం లాంటిదే ఇది
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాట్ కామెంట్స్

**బీహార్, మహా:** ప్రధాని నరేంద్ర మోదీ సామ్రాజ్యంపై తమ పార్టీ చేస్తున్న పోరాటం ఒకప్పుడు మహాత్మా గాంధీ బ్రిటిషర్లపై చేసిన స్వాతంత్ర్య సంగ్రామం లాంటిదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సీమాంచల్ ప్రాంతంలోని కతిహార్, పూర్నియా, బరారీలలో నిర్వహించిన సభల్లో ఆమె ప్రసంగించారు. ప్రధాని మోదీ 'కట్టా' (నాటు తుపాకీ) వంటి పదాలు వాడటంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఒకవైపు అహింసకు ప్రతీక అయిన 'వందే మాతరం' అంటూనే, మరోవైపు తన పదవి గౌరవానికి భంగం కలిగించేలా ప్రధాని మాట్లాడుతున్నారు. ఇది ఆయన హోదాకు తగదు" అని ప్రియాంక విమర్శించారు. బీహార్‌లోని ప్రస్తుత దుస్థితికి ఎన్డీయే ప్రభుత్వమే కారణమని ప్రియాంక ఆరోపించారు. "రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లే యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీని తప్పుగా అమలు చేయడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కుప్పకూలిపోయి ఉద్యోగాలు లేకుండా పోయాయి" అని ఆమె అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రధాని మోదీ తన ఇద్దరు కార్పొరేట్ మిత్రులకు కట్టబెడుతున్నారని ఆమె ఆరోపించారు.

# రాసి పెట్టుకోండి

(మొదటిపేజీ తరువాయి)

నేను చెప్పేది రాసి పెట్టుకోండి. 2034 జూన్ వరకూ కాంగ్రెస్సే అధికారంలో ఉంటుంది. జూబ్లీహిల్స్ నియోజవర్గానికి ఏటీసీ మంజూరు చేస్తాం." అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌దే..**

పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది.. ప్రాధాన్యత వారీగా పరిష్కరిస్తాం. నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత మాపై ఉంది. జూబ్లీహిల్స్ గెలవాల్సిందే అభివృద్ధి జరగాల్సిందే. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుస్తోంది. బీఆర్ఎస్‌కు గతమే తప్ప.. భవిష్యత్ లేదు. పంతులు లేని బడిలాగా బీఆర్ఎస్ తయారైంది. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు బీజేపీ సాయం చేస్తోంది. నాది లీడర్ మైండ్ సెట్ కాదు. కేడర్ మైండ్ సెట్, అందుకే నేను ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నా. నేను గల్లీలోనే కాదు.. ఇంటింటికీ తిరుగుతాను. బీజేపీ డిపాజిట్ కూడా రాదు' అని జోస్యం చెప్పారు. కేసీఆర్‌తోనే బీఆర్ఎస్ పని అయిపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్‌లో గెలిపించాలని కేసీఆర్ ఇప్పటివరకు విజ్ఞప్తి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తన కళ్లముందే బీఆర్ఎస్ కూలిపోతుంటే కేసీఆర్ మౌనంగా కుమిలిపోతున్నారని అన్నారు. ఎన్నికల విషయంలో నాది లీడర్ మైండ్‌సెంట్ కాదని, క్యాడర్ మైండ్‌సెట్ అని చెప్పారు.

**వృద్ధిరేటులో దేశంలోనే రంగారెడ్డి టాప్**

ప్రపంచాన్ని శాసించే సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. ఇవన్నీ తెలంగాణ గ్రోత్ ఇంజిన్‌గా మారాయి. వృద్ధిరేటులో దేశంలోనే రంగారెడ్డి జిల్లాలో మొదటి స్థానంలో ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో అత్యధిక ఆదాయం హైదరాబాద్ నుంచే వచ్చింది. బీఆర్ఎస్ పాలనలో సచివాలయం, కమాండ్ కంట్రోల్, ప్రగతి భవన్‌తో ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా?. కాళేశ్వరంలో ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా?. కాళేశ్వరం లేకున్నా దేశంలో అత్యధిక వరి దిగుబడి వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఈ స్థాయిలో వరి ఉత్పత్తి లేదు. రూ.20లక్షల కోట్లతో నికరంగా ఒక్క సాగునీటి ప్రాజెక్ట్ అయినా పూర్తి చేశారా?.



**పదేళ్ళపాలనతో పోల్చకండి**

రెండేళ్ల కాంగ్రెస్ పాలనను, పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోల్చకండి. అన్ని రంగాల్లో బకాయిలు పెట్టి రూ.8 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని మాకు అప్పగించారు. వందేళ్లు పూర్తి అయిన ఉస్మానియా ఆసుపత్రిని కూడా కట్టలేదు. తెలంగాణను పూర్తిగా దివాలా తీశారు. తాడు తెగితే పాతాళంలో పడే పరిస్థితికి తెచ్చారు. వాళ్లు దొడ్డు బియ్యం ఇస్తే, మేము సన్న బియ్యం ఇస్తున్నాం. కొత్త రేషన్‌కార్డులు ఇచ్చాం. రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసా పెంచాం. షాద్ ముబారక్ కొనసాగించాం. రూ.500లకే సిలిండర్ ఇచ్చాం. 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నాం. కేసీఆర్ ఇచ్చిన పథకాలు ఆపలేదు. వాటిని కొనసాగిస్తున్నాం. ఎర్రగడ్డ, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ ఆసుపత్రులను ఏడాదిన్నరలోగా పూర్తి చేస్తాం.

**జైపాల్ రెడ్డి కృషి వల్లే హైదరాబాద్‌కు మెట్రో**

జైపాల్ రెడ్డి కృషివల్లే హైదరాబాద్‌కు మెట్రో వచ్చింది. ఇది చరిత్ర.. ఇది కేసీఆర్ చెరిపేస్తే చెరిగేది కాదు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క కొత్త యూనివర్సిటీనైనా తీసుకొచ్చారా.. కనీసం వీసీలను నియమించలేదు. ఐదువేల పాఠశాలలు మూసేశారు. పేదలకు విద్య, రైతులకు వ్యవసాయాన్ని, మహిళలకు రాజ్యాధికారాన్ని దూరం చేశారు. దశ సరిగ్గా లేని వాడి కోసం వాస్తు పేరుతో దిశ మారిస్తే ప్రయోజనం ఉంటుందా?. మా ప్రభుత్వంలో 7100 కోట్లు ఉచిత బస్సు కోసం ఖర్చు చేశాం. ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల వైపు నడిపించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంచాం. 3 వేల కోట్లతో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తున్నాం. 100 ఎకరాల్లో హైకోర్టు నిర్మిస్తున్నాం. బీసీ కుల గణన చేసి కేంద్రం జనగణనతోపాటు కుల గణన చేసేలా చేశాం. ఎస్సీ వర్గీకరణ చేసి చూపించాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, పోలీస్ స్కూల్ ఏర్పాటు చేశాం. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. హైదరాబాద్ నగరానికి పదేళ్లలో ఒక్క చుక్క అదనంగా తాగునీరు తీసుకొచ్చారా. మేం వచ్చాక 20 టీఎంసీల గోదావరి జలాలు తెచ్చేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చాక 20 వేలకు పైగా నోటిఫికేషన్లు వేశాం, 60 వేలకు పైగా ఉద్యోగాలకు భర్తీ చేశాం. ఎవరిది అగ్రికల్చర్.. ఎవరిది డ్రగ్స్ కల్చర్ మీరే ఆలోచించండి. ఎవరిది పబ్ కల్చర్.. ఎవరిది సామాన్యులతో కలిసే కల్చర్. ఎవరు సినీ తారలతో తిరిగే కల్చర్.. ఎవరిది సినీ కార్మికుల కోసం కృషి చేసే కల్చర్ మీరు ఆలోచించండి.

**కేటీఆర్ ప్రచారం.. శ్రీలీల ఐటమ్ సాంగ్**

బీఆర్ఎస్ నేత కేటీఆర్ తమపై చేస్తున్న విమర్శలు సినిమాలో ఐటమ్ సాంగ్ లాగా ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పుష్ప సినిమాలో శ్రీలీల ఐటమ్ సాంగ్ కు, కేటీఆర్ ప్రచారానికి ఏం తేడా లేదన్నారు. టవల్ తిప్పుకుంటూ ఊపుతూ అందరినీ ఊపమంటున్నాడని, ఇది ప్రచారమా అని అన్నారు.

**కేటీఆర్ అరెస్ట్ కు ఎందుకు అనుమతి ఇవ్వలేదు**

ఫార్ములా వన్ కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయడానికి గవర్నర్ అనుమతి కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 3 నెలలు అవుతున్నా కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం విచారణను సీబీఐకి తాము అప్పగించామని, ఇంతవరకూ సీబీఐ కాళేశ్వరంపై ఎందుకు విచారణ ప్రారంభించ లేదని ప్రశ్నించారు.

# హైదరాబాద్‌లో భారీ ఉగ్రకుట్ర భగ్నం

## గుజరాత్‌లో ముగ్గురు ఉగ్రవాద అనుమానితుల అరెస్ట్

పట్టుబడ్డ వారిలో ఇద్దరు యూపీ వారు కాగా మరొకరు హైదరాబాద్ వాసి

ఎంబీబీఎస్ పూర్తి చేసిన హైదరాబాద్ కు చెందిన మోహియుద్దీన్

**అహ్మదాబాద్, మహా :** గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) టీం బృందం మరో ఉగ్ర కుట్రను భగ్నం చేసింది. ముగ్గురు ఉగ్రవాదులను గుజరాత్ లో పట్టుకుంది. పట్టుబడ్డ వారిలో ఇద్దరు యూపీకి చెందిన వారు కాగా ఒకరు హైదరాబాద్ వాసి అని అధికారులు తెలిపారు. ఉగ్రవాద కార్యకలాపాల్లో శిక్షణ పొందిన ఈ ముగ్గురూ దేశంలో భారీ పేలుళ్ళకు కుట్ర పన్నినట్లు అధికారులు గుర్తించారు. సామాజిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ వివిధ ప్రాంతాలలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసింది. తాజా అరెస్ట్ ఉగ్రవాద ఏరివేతలో ఓ పెద్ద విజయమని భావిస్తోంది. అదుపులోకి తీసుకున్నవారిపై ఏడాది కాలంగా అధికార బృందాలు నిఘావేసి ఉంచినట్టు ఏటీఎస్ వెల్లడించింది. వారికి ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్ తో సంబంధముందని పేర్కొంది. నిందితులు దేశంలో ఏదో పెద్ద ఉగ్రకుట్రకే పన్నాగం పన్నినట్లు చెప్పిన ఏటీఎస్.. అందుకోసం వారు ఇటీవల ఆయుధాల మార్పిడి కోసం గుజరాత్‌లో సంచరించినట్టు తెలిపింది. ఈ ముగ్గురూ ఉగ్రవాదంపై ప్రత్యేక శిక్షణ పొందారని, వారి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని తేల్చింది. వీరంతా రెండు వేర్వేరు సంస్థల ఉగ్ర మాడ్యూళ్లలో భాగమని తెలిపింది. నిందితులపై విచారణ చేపట్టినట్టు ఏటీఎస్ అధికారులు వెల్లడించారు. వీరితో ఇంకెవరికైనా సంబంధాలున్నాయా, వారి ప్రణాళికలేంటి అనే విషయాలు బయటపడే అవకాశమున్నట్టు తెలిపారు. 2024 జులైలో అల్‌ఖైదాతో సంబంధమున్న నలుగురు ఉగ్రవాదులను గుజరాత్ ఏటీఎస్ అరెస్ట్ చేసింది. అరెస్టైన వారిలో.. ఇద్దరు గుజరాత్ వాసులు కాగా, మరో ఇద్దరు ఢిల్లీ, నొయిడా ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. వారికి అల్‌ఖైదా ఇండియన్ సబ్‌కాంటినెంట్ మాడ్యూల్‌తో సంబంధమున్నట్టు తేల్చింది. హైదరాబాద్‌కు చెందిన అహ్మద్ మోహియుద్దీన్ (35) ఉన్నారు. ఇతను తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని దీని ఆధారంగా ఆదివారం ఆయన నివాసంలో విస్తృతంగా అధికారులు తనిఖీలు చేశారు. టెలిగ్రామ్ ద్వారా ఐఎస్‌కేపీ సభ్యులతో మోహియుద్దీన్ చర్చలు జరుపుతున్నాడని నిర్ధారించారు. నిందితుడి నుంచి రెండు గ్లాక్ పిస్టల్స్, ఒక బెరెట్టా పిస్టల్, 30 కాట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా ఈనెల 18 వరకు రిమాండ్ విధించింది. కాగా, మోహియుద్దీన్ ఫ్రాన్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు గుర్తించారు. విచారణలో మోహియుద్దీన్ ఆయుధాలను రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్ నుండి కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధం

## ప్రచారానికి తెర.. రేపే పోలింగ్.. 407 పోలింగ్ కేంద్రాలు.. అమల్లోకి 144 సెక్షన్

**హైదరాబాద్, మహా:** కొన్ని రోజులుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం మొత్తం ప్రచారంతో హీటెక్కింది. ప్రధాన పార్టీలు నువ్వా నేనా అన్నట్టుగా ప్రచారం చేశాయి. ఏ వీధిలో చూసినా.. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ జెండాలతో నేతలు ప్రచారంతో ఊపు తెచ్చారు. ఇక ఎన్నికల సంఘం పెట్టిన గడువు ప్రకారం ఆదివారం సాయంత్రం గంటలు ప్రచారం ముగిసింది. దీంతో మైకులు అన్ని బంద్ అయ్యాయి. ప్రచార గడువు నవంబర్ 9 ఆదివారం సాయంత్రం 5 గంటల వరకే. దీంతో కాలనీలు, బస్తీలు, వీధుల్లో గుమిగూడిన రాజకీయ నాయకులు ఇప్పుడు అక్కడి నుండి వెళ్లిపోయారు. ఇరుకైన సందుల్లో మోగిన మైకుల చప్పుడు వినిపించడం లేదు, సందర్శించే నాయకులు కనిపించడం లేదు. ఇంటింటికి సందర్శనలు, పార్టీ కార్యకర్తలతో కోలాహలంగా కనిపించిన జూబ్లీహిల్స్ ఇప్పుడు సైలెంట్ అయిపోయింది. రోడ్‌షోలు, పార్టీ అగ్ర నాయకుల ప్రసంగాలు, పార్టీల మధ్య బల ప్రదర్శన సాయంత్రం 5 గంటలతో అయిపోయింది. నవంబర్ 11న పోలింగ్, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇప్పుడు ఆంక్షలు మొదలు అయ్యాయి.

### 407 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు..

కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. మరో 55 మంది అభ్యర్థులు కూడా పోటీలో నిలిచారు. మొత్తం 401365 ఓటర్లు ఉన్నారు. 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సమస్యాత్మకమైన కేంద్రాల్లో భద్రతను పెంచుతారు. డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. ప్రచారం ముగియడంతో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది. మరోవైపు పోలింగ్ పెంచేందుకు ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉన్న పోలింగ్ సమయాన్ని మరో గంట పొడిగించింది. దీంతో సాయంత్రం 6 గంటల దాకా ఓటు వేయవచ్చు. ఉప ఎన్నిక నేపథ్యంలో ఈనెల 11న నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ఉత్తర్వులు జారీ చేశారు. పోలింగ్ ముందురోజు ఈ నెల 10న పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన స్కూళ్లు, ఆఫీసులకు మాత్రమే సెలవు ఇవ్వగా.. పోలింగ్ రోజు 11వ తేదీన నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఆఫీసులకు, సంస్థలకు సెలవు ఇచ్చారు. 14వ తేదీన కౌంటింగ్ జరగనున్నది.

# నవీన్ యాదవ్‌ను గెలిపించండి

## జూబ్లీహిల్స్‌లో అభివృద్ధికి బాటలు వేయండి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### పొంగులేటి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.. విశేష స్పందన



**హైదరాబాద్, మహా:** గత 12ఏళ్లుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహించలేదని, ఫలితంగా ఇక్కడ అభివృద్ధి కుంటుపడినందున ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం మంత్రి పొంగులేటి రెహ్మత్ నగర్ డివిజన్‌లోని కార్మికనగర్, బ్రహ్మ శంకర్ నగర్, రామిరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు, కార్యకర్తలతో మమేకమయ్యారు. సాయంత్రం రెహమత్ నగర్ నుంచి బోరబండ వరకు మంత్రి పొంగులేటి నిర్వహించిన భారీ ర్యాలీకి విశేష స్పందన లభించింది. వేలాదిమంది కాంగ్రెస్ జెండాలు చేతబూని ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగలేటి స్ఫూర్తిదాయకంగా ప్రసంగిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని పిలుపునిచ్చారు. పొంగులేటి ప్రసంగానికి ప్రజలు భారీగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గడిచిన 23 నెలలుగా తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసి జూబ్లీ హిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఈ ప్రాంతానికి ఎంతో సుపరిచితుడూ, యువకుడైన నవీన్ యాదవ్ కు అండగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గడిచిన 12 సంవత్సరాల నుంచి ఈ ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం వహించలేదు. 10 సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ నియోజకవర్గంలో ఆ పార్టీకి చెందిన ఎంఎల్ఏ ఉన్నాగానీ ఈ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయిందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పేరుకే సంపన్నుల నియోజకవర్గం.. వాస్తవానికి ఇక్కడ మెజారిటీగా ఉన్నది బడుగు, బలహీన, పేదలు నిరుపేదలే.వీళ్ల సంక్షేమాన్ని పది సంవత్సరాలలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏనాడూ పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును గుర్తించి జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీని అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని మంత్రి అందరికీ పేరు పేరున విజ్ఞప్తి చేశారు. బ్యాలెట్ లో 2వ నెంబరు కలిగిన కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి మీ సంక్షేమానికి, కాంగ్రెస్ పార్టీ విజయానికి బాటలు వేయాలని, ఈ ప్రాంతప్రజలకు ఇంతకంటే మంచి అవకాశం రాదని మంత్రి పొంగులేటి అన్నారు.



# తమిళనాడులో కొత్త సర్కార్

## బీజేపీ స్టేట్ చీఫ్ నాగేంద్రన్ కీలక వ్యాఖ్య

**తమిళనాడు, మహా:** తమిళనాడు ప్రస్తుత అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది మే 10తో ముగియనున్న విషయం తెలిసిందే. ఇక్కడ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈసీ నుంచి అధికారికంగా ఎటువంటి ప్రకటన రాకముందే.. ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నాగేంద్రన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏప్రిల్ 10న రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నాయని ఓ కార్యక్రమంలో చెప్పడం గమనార్హం. ధర్మపురిలో నిర్వహించిన ఓ సభలో ఆయనతో పాటు అన్నాడీఎంకే మాజీ మంత్రి కేపీ అన్బళగన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నయినార్ మాట్లాడుతూ.. "రాష్ట్రంలో వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఎన్నికలు జరగనున్నాయి. ఎడప్పాడి పళనిసామి ఎన్డీయే అభ్యర్థి. ఇది బలమైన కూటమిగా నిలుస్తుంది. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో పళనిసామి చేతులు కలిపితేనే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పనిచేస్తుంది. కేంద్రం నుంచి నిధులు వస్తాయన్నారు.

# వింత ఆచారం



**ఖానాపూర్ మహా :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో వింత ఆచారం ఆనవాయితీగా వస్తోంది. ప్రతీ ఐదేళ్ల కోసారి జ్యేష్ఠ లక్ష్మి అమ్మవారిని ఊరవతలికి సాగనంపుతారు. ఊరికి పట్టిన అరిష్టం జ్యేష్ఠ లక్ష్మీని సాగనంపడం ద్వారా దూరమవుతుందన్నది గ్రామ ప్రజల నమ్మకం. ఉదయం 5 గంటల నుండి గ్రామంలోని వారంతా ఇంటిలోని పాత వస్తువులు, చీపిర్లు ,చాటలు, గుల్లలు పాత దుస్తులు వంటి వాటిని పోగుచేసి పలు వీధుల గుండా ఊరేగింపుగా జేష్ఠలక్ష్మి అమ్మవారిని ఊరి పోలిమేరలకు సాగనంపారు. ఊరి ఆచార వ్యవహారాల ప్రకారం జ్యేష్ఠలక్ష్మిని ఐదు సంవత్సరాలకు ఒకసారి ఊరి నుండి ఊరి చివర వరకు సాగనంపుతామని విడిసి అధ్యక్షుడు రాజన్న తెలిపారు.. ఊరికి అరిష్టం పట్టకుండా, పిల్లాపాపలు, పాడిపంట చల్లగా ఉండాలని ఈ పండుగను నిర్వహిస్తామని అన్నారు.

# హత్య ఎలా చేయాలో యూట్యూబ్‌లో సెర్చ్ చేసి అత్తను సజీవ దహనం చేసిన కోడలు

## దొంగా పోలీస్ ఆట పేరుతో అత్తను లేపేసింది

**విశాఖ, మహా:** అత్త చాదస్తం, సూటిపోటి మాటలతో విసిగిపోయిన ఓ కోడలు అత్యంత దారుణానికి ఒడిగట్టింది. ఆమెను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం యూట్యూబ్‌లో హత్యలు చేసే పద్ధతులను చూసి, పక్కా ప్రణాళికతో అత్తను సజీవదహనం చేసింది. ఈ ఘోరాన్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినా, పోలీసుల దర్యాప్తులో అసలు నిజం బయటపడింది. విశాఖపట్నం జిల్లా పెందుర్తిలో జరిగిన ఈ దారుణ ఘటనలో నిందితురాలైన కోడలిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెందుర్తి మండలం వేపగుంట అప్పన్నపాలెంలోని వర్షిణి అపార్టుమెంట్ లో జయంతి సుబ్రహ్మణ్యం తన తల్లి కనకమహాలక్ష్మి (63), భార్య లలితాదేవి (30), ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి సుబ్రహ్మణ్యం పౌరోహిత్యం కోసం బయటకు వెళ్లిన సమయంలో లలితాదేవి తన పథకాన్ని అమలు చేసింది. పిల్లలతో 'దొంగా పోలీస్' ఆట ఆడుదామని అత్త కనకమహాలక్ష్మిని నమ్మించింది. ఆటలో భాగంగా, వాలుకుర్చీలో కూర్చున్న అత్త కళ్లకు చున్నీతో గంతలు కట్టి, చేతులు, కాళ్లను తాళ్లతో బంధించింది. అనంతరం, ముందుగా కొని దాచిపెట్టిన పెట్రోల్‌ను ఆమెపై పోసి నిప్పంటించింది. మంటల్లో చిక్కుకుని కనక మహాలక్ష్మి అక్కడికక్కడే సజీవదహనమయింది. నానమ్మ అరుపులు విని పరుగెత్తుకొచ్చిన కుమార్తె శ్రీనయనకు కూడా మంటలు అంటుకుని గాయాలయ్యాయి. ఈ ఘోరాన్ని కప్పిపుచ్చేందుకు లలితాదేవి నాటకమాడింది. ఇంట్లో టీవీ పేలి ప్రమాదం జరిగిందంటూ గట్టిగా అరుస్తూ ఇరుగుపొరుగు వారిని పిలిచింది. వారు వచ్చి చూసి అగ్నిప్రమాదంగానే భావించారు. అయితే, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఫ్లాట్‌లో పెట్రోల్ వాసన రావడంతో అనుమానించారు. హత్య కోణంలో దర్యాప్తు ప్రారంభించి లలితాదేవి సెల్‌ఫోన్‌ను పరిశీలించారు. ఆమె యూట్యూబ్ హిస్టరీలో 'హత్య చేసి తప్పించుకోవడం ఎలా?' వంటి వీడియోలు ఉండటాన్ని గుర్తించారు. అదే సమయంలో, భర్త సుబ్రహ్మణ్యం కూడా తన భార్య ప్రవర్తనపై పోలీసుల వద్ద అనుమానం వ్యక్తం చేశాడు. దీంతో పోలీసులు లలితాదేవిని తమదైన శైలిలో విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించింది.




# మత రాజకీయాలను తిప్పికొట్టాలి

## బండారు రమేష్, సిపిఎం రాష్ట్ర నాయకులు

**వలిగొండ, మహా:** మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజల్లో అనైక్యత సృష్టిస్తున్న మత రాజకీయాలను తిప్పి కొట్టాలని సిపిఎం రాష్ట్ర నాయకులు బండారు రమేష్ పిలుపునిచ్చారు ఆదివారం రోజున సంగెం ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి సాంస్కృతిక వైజ్ఞానిక శిక్షణ తరగతుల కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో మత స్వేచ్ఛ ప్రతి పౌరునికి ఉందని కానీ దాన్ని రాజకీయాలకు వాడుకోకూడదని చెప్తున్నప్పటికీ దేశానికి పాలకులుగా ఉన్న బిజెపి మతం పేరుతో దేశంలో ప్రజల మధ్యన ఉద్రిక్తతలు సృష్టిస్తుందని అన్నారు మతం వేరని రాజకీయాలు వేరని దృష్టిని మర్చిపోయి పాలకులుగా ఉన్న వారే మతాన్ని రాజకీయాలకు ముడి పెట్టడం దుర్మార్గమని అన్నారు మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న రాజకీయ పార్టీల విధానాలను ప్రజలు అర్థం చేసుకోవడంతో పాటు దాన్ని ఓడించడమే ఏకైక కర్తవ్యమని ఆయన పిలుపునిచ్చారు ఈ క్లాసుల కు ప్రిన్సిపాల్ గా దేశపాక రవి వ్యవహరించగా, ఈ శిక్షణా తరగతుల్లో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటిపాక శివ, ఈర్లపల్లి ముత్యాలు,సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, సిపిఎం శాఖ కార్యదర్శి భీమనబోయిన జంగయ్య, పిఎన్ఎం జిల్లా మండల నాయకులు, గోషిక కరుణాకర్,గంటేపాక శ్రీకృష్ణ,మేడి ముకుంద,రాధారపు మల్లేశం,,ఏటెల్లి నరసింహ,ఎర్ర వెంకటేశం,తదితరులు పాల్గొన్నారు



# పీజేఆర్‌ను చంపిందే కాంగ్రెస్ పార్టీ

- పరాకాష్టకు చేరిన సీఎం రేవంత్ మూర్ఖత్వం
- బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడిపోతే.. తన కుర్చీకి ఎసరు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భయపడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. అందుకే ఈ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం సర్పంచ్ ఎన్నికలకు తిరిగినట్లు సీఎం రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రెస్ క్లబ్.. రేవంత్ రెడ్డికి పబ్ మాదిరి కన్పించిందని వ్యంగ్యంగా అన్నారు. అందుకే స్టార్ హోటల్‌లో ప్రెస్ మీట్ పెడుతున్నారంటూ మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జగదీష్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుటుంబ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంను ప్రశ్నించిన వారిని.. నువ్వు చేద్దువురా అంటూ రేవంత్ రెడ్డి చేతకాని మాటలు మాట్లాడుతున్నారని తెలిపారు. సీఎం కుర్చీ నుంచి దిగిపోయి ఆర్.కృష్ణయ్య లేదా మంద కృష్ణమాదిగకు అప్పగించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. సీఎం కుర్చీ ఇంకెవరికి ఇచ్చినా.. రేవంత్ రెడ్డి కంటే మంచిగా వారు పని చేస్తారన్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం ఉత్తమ్, భట్టి, మహేష్ కుమార్ గౌడ్ రెడీగా ఉన్నారన్నారు. కేసీఆర్ పాలనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు చెప్తున్నారని విమర్శించారు. 24 గంటల ఉచిత కరెంట్, ఇంటింటికి మంచి నీరు దేశంలో కేసీఆర్ మాత్రమే ఇచ్చారని తెలిపారు. 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకోవటం సిగ్గు చేటుగా ఉందని తెలిపారు. సీఎంలుగా చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డిల పాలనపై రేవంత్ రెడ్డి ప్రశంసలు కురిపించడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. పీజేఆర్‌ను చంపిందే కాంగ్రెస్ పార్టీ అని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. పీజేఆర్ కుటుంబానికి రాజకీయాల్లో స్థానం లేకుండా చేసిందే రేవంత్ రెడ్డి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ కుటుంబంపై అంత ప్రేమే ఉంటే.. పీజేఆర్ కొడుక్కి ఎందుకు టికెట్ ఇవ్వలేదు? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. 2004 నుంచి 2014 వరకు శ్మశానానికి స్వర్ణయుగం అంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబు హయాంలో సొంత జిల్లా పాలమూరులో ఆకలి చావుల చోటు చేసుకున్న సంగతి రేవంత్ రెడ్డి మర్చిపోయాడా? అంటూ సందేహం వ్యక్తం చేశారు.

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యమంలా అవేర్ నెస్ కార్యక్రమాలు చేపట్టాలి

### సైబర్ కేటుగాళ్ల ప్రధాన లక్ష్యం మహిళలు, వృద్ధులే..

### సైబర్ క్రైమ్ నియంత్రణ అవగాహన కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి




**హైదరాబాద్, మహా :** సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నాయని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. ఫోన్ కాల్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఇంటరాక్షన్‌తోనే సైబర్ కేటుగాళ్లు నేరాలు చేస్తున్నారని తెలిపారు. పాత నేరస్థుల మాదిరిగానే కొత్త నేరస్థులు కూడా డేటాను సులభంగా సేకరిస్తున్నారన్నారు. ధనవంతులెవరు, ఏ ప్రాంతంలో ఉంటారన్న వివరాలన్నీ తెలుసుకొని.. వారినే లక్ష్యంగా సైబర్ మోసగాళ్లు ఎంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఇది సాధారణ సమస్య కాదని.. ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని పేర్కొన్నారు హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్‌క్రైమ్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీపీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమం లాగాకాకుండా, దీనిని ఒక ఉద్యమంలా తీసుకోవాలని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధులు, గృహిణులు సైబర్ కేటుగాళ్లకు ప్రధాన లక్ష్యంగా మారుతున్నారన్నారు. మహిళలు ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఫోన్లు చేసి భయపెట్టి మోసం చేస్తున్నారన్నారు. ప్రజలు అత్యంత మెలకువగా ఉండాల్సిన సమయం ఇదని తెలిపారు. యువకులు, రిటైర్డ్ వ్యక్తులు, ప్రముఖులు అందరూ కూడా ఈ అవేర్‌నెస్‌లో భాగం కావాలని కోరారు. సైబర్ అవేర్‌నెస్ గురించి ఒకరు పదిమందికి, పది మంది ఇరవై మందికి చెబితే ఇది పెద్ద మాస్ మూవ్‌మెంట్ అవుతుందని ఉద్ఘాటించారు. సైబర్ నేరగాళ్లకు అత్యంత అడ్డంకి ప్రజల అవగాహనేనని తెలిపారు. హైదరాబాద్‌లో సైబర్ అవేర్‌నెస్ ఉన్నప్పటికీ, ఇంకా బాధితులు ఉన్నారని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సైబర్ బాధితులు తగ్గేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో 24 గంటలు 'సైబర్ పెట్రోలింగ్' ద్వారా పనిచేస్తోందని వివరించారు. మోసాల అవకాశాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నేరస్థులు ఎప్పుడూ పోలీసుల కంటే ఒక అడుగు ముందుండేందుకు ప్రయత్నిస్తారన్నారు. అందుకే ప్రజల్లో సైబర్ అవేర్‌నెస్ అవగాహన మరింత అవసరమని వివరించారు. రూరల్ ఏరియాల్లో కూడా ఇలాంటి క్యాంపెయిన్ విస్తరిస్తామని తెలిపారు. హైదరాబాద్ సిటీలో ఇది ప్రారంభం మాత్రమేనని.. త్వరలోనే మొత్తం తెలంగాణలో సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.




# హైడ్రా కాపాడిన పార్క్ లో వనభోజనాలు


## సత్యనారాయణ వ్రతం నిర్వహించి సంబరాలు చేసుకున్న నివాసితులు

**నిజాంపేట, మహా:** నిజాంపేట మున్సిపాలిటీ కోశల్యానగర్లోని హైడ్రా కాపాడిన బనియన్ ట్రీ పార్కులో స్థానికులు ఆదివారం వనభోజనాలు చేశారు. కార్తీకమాసం కావడంతో సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. నిజాంపేట మున్సిపాలిటీలో ఇటీవల హైడ్రా రెండు పార్కులను హైడ్రా కాపాడింది. బృందావన్ కాలనీలో 2300 గజాల పార్కును కాపాడగా.. కౌశల్యానగర్ కాలనీలోని 300ల గజాల విస్తీర్ణంలో ఉన్న బనియన్ ట్రీ పార్కును కబ్జాల నుంచి రక్షించింది. కౌశల్య నగర్ కాలనీలోని 300 గజాల పార్కుకు చుట్టూ ఆక్రమణదారులు ప్రహరీ నిర్మించి కాజేశారు. ఎవరూ పార్కులోకి రాకుండా అడ్డుకున్నారు. అలా ఆక్రమణలో వున్న పార్కును కాపాడి కోశల్యానగర్ కాలనీ వాసులకు హైడ్రా అప్పగించింది. అందుకే కాలనీవాసులు బనియన్ ట్రీ పార్కుకు చేరుకుని కార్తీక వనభోజనాలు చేశారు. అదే పార్కులో కాలనీ వాసులు సత్యనారాయణ స్వామి వ్రతం చేసారు. దాదాపు వెయ్యి మంది కలసి ఈ ఉత్సవాలను జరుపుకున్నారు. పిల్లలు పెద్దలు హైడ్రా జిందాబాద్..అంటూ హైడ్రాకి హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలియ చేసారు. ప్లకార్డులు ప్రదర్శించి హైడ్రాకు మద్దతు పలికారు. అలాగే బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలో ఫార్చ్యూన్ మెడోస్ కాలనీలో అడ్డుగోడలు తొలగించి వెను వెంటనే సిమెంట్ రోడ్డు వేసిన హైడ్రాకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. హైడ్రా వచ్చింది దారులు తెరిచిందంటూ కీర్తించారు.



# పార్టీలకు ఎప్పుడూ ఆర్ఎస్ఎస్ మద్దతు ఇవ్వదు

- రామ మందిరానికి కాంగ్రెస్ మద్దతిచ్చినా అండగా నిలిచేవాళ్లం
- కాషాయం మాకు గురువు లాంటిది
- విమర్శలను పట్టించుకోం.. అవే మాకు మరింత ప్రచారం కల్పిస్తాయి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



**హైదరాబాద్, మహా :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏ ఒక్క వ్యక్తికి గానీ, రాజకీయ పార్టీకి గానీ మద్దతు ఇవ్వదని, కేవలం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటుందని ఆ సంస్థ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బెంగళూరులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రసంగ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియా అడిగిన ఓ ప్రశ్నకు భగవత్ బదులిస్తూ "మేము ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వం. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనబోము. సమాజాన్ని ఏకం చేసే పనిలో సంఘ్ నిమగ్నమై ఉంది. కానీ రాజకీయాలు స్వభావరీత్యా విభజనకారిగా ఉంటాయి" అని వివరించారు. దేశానికి మేలు చేసే విధానాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, తమ ప్రభావాన్ని ఉపయోగించి సరైన విధానాలకు అండగా నిలుస్తామని తెలిపారు. "ఉదాహరణకు, అయోధ్యలో రామ మందిరం కావాలని మేము కోరుకున్నాం. ఆ లక్ష్యం కోసం నిలబడిన వారికి మా వలంటీర్లు మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో బీజేపీ ఆ ఉద్యమంలో ఉంది కాబట్టి వారికి మద్దతిచ్చాం. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రామమందిర ఉద్యమానికి మద్దతు ఇచ్చి ఉంటే, మా కార్యకర్తలు ఆ పార్టీతోనే నిలబడేవారు" అని ఆయన తేల్చి చెప్పారు. "మాకు ఏ పార్టీ సొంతం కాదు, అలాగని ఏ పార్టీ పరాయిదీ కాదు. ఎందుకంటే అవన్నీ భారతీయ పార్టీలే. మేము 'రాష్ట్ర నీతి'కి మద్దతిస్తాం, 'రాజనీతి'కి కాదు. ఈ దేశం ఏ దిశలో పయనించాలనే దానిపై మాకు ఒక దార్శనికత ఉంది. ఆ దిశగా ఎవరు పని చేసినా వారికి మా మద్దతు ఉంటుంది" అని భగవత్ పేర్కొన్నారు.

### జెండా వివాదంపై స్పష్టత

జాతీయ జెండాకు బదులుగా ఆర్ఎస్ఎస్ ఎందుకు కాషాయ జెండా (భగవా ధ్వజ్)ను ఉపయోగిస్తుందన్న ప్రశ్నకు ఆయన వివరణ ఇచ్చారు. "సంఘ్ 1925లో ప్రారంభమైంది. మాకు ఒక గురువు అవసరం. కానీ వ్యక్తిని గురువుగా స్వీకరిస్తే, వారికి పరిమిత ఆయుష్షు ఉంటుంది. అందుకే శాశ్వతంగా ఉండే మన సంస్కృతికి, హిందుత్వానికి ప్రతీకగా కాషాయ జెండాను గురువుగా స్వీకరించాం" అని తెలిపారు. జాతీయ జెండాను 1937లో ఖరారు చేశారని, దాని రూపకల్పన జరిగినప్పటి నుంచి తాము త్రివర్ణ పతాకాన్ని గౌరవిస్తూనే ఉన్నామని అన్నారు. "ప్రైవేట్ సంస్థలు జాతీయ జెండాను ఎగురవేయవచ్చని కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత, జనవరి 26, ఆగస్టు 15న అన్ని శాఖలలో జెండా వందనం చేస్తున్నాం. కమ్యూనిస్ట్ పార్టీకి ఎర్ర జెండా, కాంగ్రెస్‌కు వారి జెండా ఉన్నట్లే, మాకు కాషాయ జెండా ఉంది. ఇందులో వివాదం ఏమీ లేదు" అని స్పష్టం చేశారు. మీడియా విమర్శలపై స్పందిస్తూ, "ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొందరి పని సంఘ్ గురించి సందేహాలు రేకెత్తించడమే. వారి విమర్శల వల్లే మాకు మరింత ఆదరణ పెరుగుతోంది. నిజం తెలిసినా కొందరు విమర్శిస్తూనే ఉంటారు. మేము వాటిని పట్టించుకోకుండా దేశం కోసం మా పని మేము చేసుకుంటూ పోతాం" అని మోహన్ భగవత్ అన్నారు.

ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 10-11-2025
సాహిత్యం LITERATURE 04

# కవనకుతూహలం

కవిత్వం
పూల పరిమళం వంటిదే
ఎవరినీ ఉద్దేశించింది కాదు
ఎవరెంత గ్రహిస్తే అంత!
ఒక్కసారి పద్యం
ఎంత ఉడికించినా ఉడికి చావదు
లోపలి దుఃఖాన్ని వెలికి తీయడానికి
సాలెపురుగై అల్లుకపోవాలి!
సలసల కాగందే
బంగారమై మెరిసిపోదు
పద్యాన్ని మోస్తున్న కాగితం
కాలాన్ని వెలిగించే
సూర్యబింబం కావాలంటే
కవిది రాత్రంతా ప్రసవ వేదన
చీకటితో యుద్ధం చేయాల్సిందే!
ఉదయించిన పద్యం
వింత కాంతులీనుతుంటే
కవనకుతూహలం
పురివిప్పిన మయూరమే!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి, 9440233261





ఇప్పుడు మనకు ఒక అవసరం, అనవసరంగా వుంది
ఎవరో అది? మనలను మన హద్దులు నిర్ణయించి, నియంత్రించి
జీవితాలను స్వేచ్ఛలేని వలయంలోకి నెట్టివేస్తున్నది !
ఎవరో అది? గోడ చాటున, తలుపుల మాటున నక్కి నక్కి చూస్తూ
అవకాశం కోసం అమాయకమైన గొర్రెల కోసం కాచుకొని వున్నది


- డా. రూప్ కుమార్ డబ్బీకార్, 91778 57389

# అనువాదాలకు మాండలికం అడ్డు కాదు



-పెద్దింటి అశోక్ కుమార్

మొన్న హైదరాబాదులో జరిగిన ఛాయా లిటరరీ ఫెస్టివల్ ఒక కొత్త ఒరవడిని సృష్టించింది. లిటరరీ ఫెస్టివల్స్ అని వినడమే కానీ చూడని తెలుగు ప్రజలకి ఒక కొత్త కార్యక్రమాన్ని పరిచయం చేసింది. చాలా క్రమపద్ధతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ అంశాలతో పాటు అనువాద సాహిత్యాల గురించి కూడా ఒక సెషన్ లో చర్చ జరిగింది. లోగిలి వేదిక మీద జరిగిన ఈ సెషన్లో 'అనువాదంలో సమకాలీన దక్షణ భారతీయ రచన' అంశం మీద స్వీయానుభవాలు, స్వంత అనువాదాల మీద చర్చ జరిగింది. ఖదీర్ బాబుగారు, నేనూ, షీలా టోమి గారు పాల్గొనగా అక్కిరాజు భట్టిప్రోలు గారు సభను నిర్వహించారు. ప్రస్తుత అనువాద సాహిత్య పరిస్థితులు, పుస్తకాలలో ఎన్ని అనువాదం అయ్యాయి, ఏ భాషల్లోకి అనువదించబడ్డాయి, ఎవరు చేశారు, అనువాదంలో ఎదురైన కష్టాలు, ఏ రకమైన సాహిత్యం అనువాదానికి అనుకూలంగా ఉంటుంది, అనే అంశాల మీద చర్చ జరిగింది. ఖదీర్ బాబు గారు షీలాటోమీ గారు తమ తమ అభిప్రాయాలను అనువాదాల గురించిన విషయాలను వివరించారు. అందరి అభిప్రాయాలు విన్నాక మాండలికం కానీ భాష కానీ అనువాదాలకి అడ్డంకి కాదని తెలిసింది. నాకు నేనుగా తెలంగాణ భాషలోనే కథలను రాశాను. వాటి అనువాద సాహిత్య ప్రయాణం గురించి కూడా వివరించాను.



అనువాదం అంటే అతి సున్నితమైన ప్రక్రియ. ఏ భాషలో రచయితలు ఆ భాషలో అద్భుతంగా కథలు రాసుకోవచ్చు. అది వారి ఇష్టా ఇష్టాలు, ఆలోచనా పరిణితిని భట్టి ఉంటుంది. కానీ అనువాదం వేరు. రెండు భాషల్లో ప్రావీణ్యం ఉండాలి. మూల రచయిత యొక్క, ఆలోచనలు, భావోద్వేగాలను పట్టుకోవాలి. మూల రచన యొక్క ఆత్మను పట్టుకోవాలి. దానిని అంతే పదిలంగా ఎక్కడ ఎలాంటి అవరోధం లేకుండా అనువాదం చేసే భాషలోకి పట్టుకు రావాలి. అంతే భావోద్వేగంతో అదే ఆత్మను ప్రతిబింబించే విధంగా అనువాద భాషల్లోకి ఎక్కించాలి. అంటే అనువాదకుడికి రెండు హృదయాలు ఉండాలి. ఒక హృదయంతో ఆత్మను పట్టుకుంటాడు. మరొక హృదయంతో ఆత్మను ఆవిష్కరిస్తాడు. ఒక చెరువులోని చేప పిల్లను పట్టుకొని సున్నితంగా మరొక చెరువులోకి వదిలినంత సున్నితంగా




అనువాదం జరగాలి.
నా మొట్టమొదటి అనువాదం హిందీలోకి జరిగింది. అది ' పిల్ల జలగ' అనే కథ. నేను ఈ కథను ప్రజా సాహితి పత్రికలో తెలంగాణ భాషలో 2002లో రాశాను. దానిని చదివి శాంతా సుందరి గారు హిందీలోకి అనువాదం చేశారట. అప్పుడు నేను మా ఊరు భీముని మల్లారెడ్డిపేటలో ఉంటూ పక్కనే ఉన్న కోరుట్ల పేటలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. చాలా రిమోట్ విలేజ్. ఫోన్ లు కూడా లేవు. బస్సులు, వాహనాలు రావడమే అరుదు. ఉత్తరాలు కూడా సరిగా అందేవి కావు. అలా ఆ కథ అనువాద వార్తను నేను చాలా రోజుల తర్వాత ఉత్తరం ద్వారా తెలుసుకున్నాను. తర్వాత కాలంలో శాంతా సుందరి గారు చాలా ఇష్టపడి సెలెక్టివ్ గా 25 కథలను హిందీలోకి అనువాదం చేశారు. అవి వివిద పత్రికల్లో అచ్చయ్యాయి. అనువాద సమయంలో కొన్ని కొన్ని పదాలు తప్ప ఆమెకు భాష ఏమాత్రం అవరోధం కాలేదు. అందులో 11 కథలతో ' ఆక్రమణ్ కబ్ కా హోచుకా' పేరుతో హిందీలో ఆంధ్ర ప్రదేశ్ హిందీ అకాడెమి సహకారంతో 'స్పృహ' సాహితి సంస్థ వారు సంపుటంగా వేశారు. ఆ కథల సంపుటికి హిందీలో మంచి గుర్తింపు వచ్చింది. సమీక్షలు కూడా వచ్చాయి.

తర్వాత పూనె నుంచి సాయినాథ్ పచారే గారు ఆ కథలను మరాఠీ లోకి అనువదించారు. రశ్మి బుక్ ఏజన్సీ కొల్హాపూర్ వారు డైరెక్ట్ గా మరాఠీలో 'ఓ గర్ బంద్ డాలియా' పేరుతో సంపుటిగా వేసారు. అడపాదడపా ఒకటి రెండు కథలు ఇంగ్లీషులోకి కూడా అనువాదమయ్యాయి. అల్లాడి ఉమ శ్రీదర్ గారు జుమ్మెకి రాత్ మే కథను అనువదంచగా ఓల్గా గారు సంకలనం చేసిన కథా సంకలనం లో అచ్చయింది. ఈ కథ హిందీ, కన్నడ, భాషల్లోకి కూడా అనువాదమయింది. కన్నడలో సృజన్ గారు అనువదించగా పత్రికలో అచ్చయింది. తెలంగాణ భాషలో రాసిన మాయిముంత కథ కూడా హిందీ ఇంగ్లీష్ లోకి అనువాదం అయింది.

తర్వాత 12 కథలను శుభమంగళ గారు కన్నడలోకి అనువదించగా అవి వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. తర్వాత ఈ కథలను 'జాల' పేరుతో వంశీ పబ్లికేషన్స్ బెంగులూరు వారు సంపుటిగా తెచ్చారు. ఆ సంపుటికి 2024 కువెంపు అనువాద సాహిత్య అవార్డు వచ్చింది. అనువాదం చేస్తున్నప్పుడు శుభమంగళ గారు కూడా కొన్ని పదాలు తప్ప భాషా విషయంలో ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోలేదు. భావాన్ని పట్టుకున్నారు. జిగిరి నవలను ముందుగా జె ఎల్ రెడ్డిగారు హిందిలోకి అనువదించగా అది కేంద్ర సాహిత్య అకాడెమి వారి సమకాలీన భారతీయ సాహత్య పత్రికలో అచ్చయింది. దానితో ఈ నవల అన్ని భారతీయ భాషల రచయితలు చదివే అవకాశం కలిగింది. అలా ఇంగ్లీష్, ఒరియా, కన్నడ, బెంగాలి, పంజాబి, తమిల్, మరాటి, సింది, మొదలగు తొమ్మిది భాషల్లోకి అనువాదం కాగా ఒరియా పంజాబీ భాషల్లో రెండు సార్లు అనువాదమయింది. ఇప్పుడు మలయాళంలోకి అనువదించబడుతుంది. జయం రెడ్డి గారు కూడా కొన్ని మాటలకు అర్థాలు తప్ప భాష కాకుండా భావాన్ని పట్టుకున్నారు అందుకే హిందీలోకి అంత గొప్పగా ఆత్మను ఆవిష్కరించారు.

నా కథలు హిందీ మరాఠీ కన్నడ ఇంగ్లీష్ భాషల్లోకి అనువాదం అయ్యాక తెలిసింది ఏమిటంటే అనువాదానికి ప్రాంతీయ సాహిత్యం ఏమాత్రం అడ్డు కాదు. రచనలల్లొ సమకాలినత, సార్వజనీనత, సంఘర్షణ ఉంటే అది తప్పకుండా అనువాదానికి అర్హత పొందినట్టే.

# నవలా రూపంలో వచ్చిన సతీస్మృతి

భార్య భర్తల మధ్య అనుబంధం పరస్పర అవగాహన, గౌరవం, నిజాయితీ, పారదర్శకత మరియు ఒకరి సంతోషం గురించి ఒకరికొకరు ఆలోచించుకోవడం వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. కానీ చాలామంది భర్తలు అహంకారంతో, ఆధిక్యతా భావంతో, భార్యల పట్ల చులకన భావంతో ఉంటారు. రిటైర్ అయిన తర్వాతనే భార్య విలువ తెలిసి వస్తుంది. కూతుళ్ళకు పెళ్లిళ్లు అయి అత్తారింటికి వెళ్లి పోతారు. కొడుకులు వారి పిల్లలు, కుటుంబంలో బిజీగా ఉండి తల్లిదండ్రులను పట్టించుకోరు. అప్పుడు వృద్ధాప్యంలో భార్యాభర్తలు ఒకరికొకరు తోడునీడగా ఉండాల్సి వస్తుంది. మానసిక కృంగుబాటు, శారీరిక అశక్తత, రోగాలతో భర్తలు, భార్యల మీద ఎక్కువగా ఆధార పడాల్సి వస్తుంది.

సోమరిపోతులు, బద్ధకస్తులైన భర్తలు మొదటి నుండి భార్యలపై ఆధారపడి అన్ని పనులు ఆమెకే అప్పగిస్తారు. ఇంట్లో ఇక్కడ పుల్ల అక్కడ పెట్టరు. భర్త తను గీచిన గీటు దాటడనే అభిప్రాయంతో భార్యలు కూడా భరిస్తారు. నాకు తెలిసిన ప్రముఖ కవి ఒకరు భార్యను తాగడానికి నీళ్లు అడిగితే గ్లాస్ లో తెచ్చి పెట్టింది. ఆ కవి ఆమెను మళ్లీ పిలిచి గ్లాసు చేతికి ఇవ్వమని అడుగుతాడు. తాను బూట్లు తొడుక్కోవాలంటే భార్య వచ్చి సాక్సులు తొడిగి బూట్లు కూడా తోడగడం చూసి నాకు నవ్వాలో, ఏడ్వాలో తెలియలేదు. విధి వక్రించి ఆమె చనిపోగా అతని పరిస్థితి రెక్కలు తెగిన దిక్కులేని పక్షిలా తయారయింది. మొదటి నుండి పిల్లల్ని ఆయన పట్టించుకోలేదు. తర్వాత పిల్లలు కూడా ఆయన్ని పట్టించుకోవడం మానేశారు. సమానత్వం, సమ సమాజం గురించి రాసే కవే ఇలా ఉంటే, వేరే వారి గురించి ఏం చెప్పుకుంటాం.

ముసలితనంలో ముందుగా భార్య చనిపోతే ఇక భర్త బ్రతుకు అగమ్య గోచరంగా మారుతుంది. ముఖ్యంగా ఒంటరితనం, ఏకాంతం భరించడం కష్టంగా ఉంటుంది. క్రమంగా దుఃఖం తగ్గుముఖం పట్టినా ,ఆమె జ్ఞాపకాలు అతడిని తొలచి వేస్తుంటాయి. ఆమె పట్ల తన గత ప్రవర్తనను తలచుకొని రియలైజేషన్ కు గురి అవుతాడు. కోడలు పరాయి పిల్ల. ఎంతైనా మొహమాటం, ఏది అడగలేడు. పిల్లల్ని దూరం పెడతారు. తన సమస్యలు అవసరాలు ఎవరికి చెప్పుకోవాలో తెలీదు. స్నేహితులతో చెప్పుకోలేని విషయాలు భార్యకు చెప్పుకుంటారు. భార్య లేకపోతే ఎవరికీ చెప్పుకుంటాడు. ఏదైనా తెలిసిన విషయమో, సలహానో చెబుదామనుకుంటే ఛీత్కరిస్తారు. చచ్చిపోవడం మేలనిపిస్తుంది. దీనికి భిన్నంగా కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు తమ తమ వ్యాపకాలలో మునిగిపోయి భార్య లేని లోటును కొద్దో గొప్పో పూరించుకోగలుగుతారు.

భార్యా వియోగంలో ఆమె జ్ఞాపకాలను తలపోస్తూ, మొదటి స్మృతి కావ్యాన్ని రచించిన ఘనత వడ్డాది సుబ్బరాయ కవి( 1854) గారికే దక్కుతుంది. ఆయన మొదటి భార్య చనిపోగా ఆమెపై సతీ స్మృతి (1902) కావ్యం వెలువరించారు. ఆమె తర్వాత రెండో పెళ్లి చేసుకోగా ఆమె మరణించడం, తర్వాత మూడవ, నాలుగవ ,ఐదవ భార్యలను చేసుకోవడం వారు




మరణించడంతో వరుసగా వారిపై స్మృతి కావ్యాలను రాశాడని కొందరు, లేదు మొదటి భార్యపై మాత్రమే సతీస్మృతి రాశాడని కొందరు, ఐదుగురు భార్యలకు సంబంధించి ఒకే సతీ స్మృతి గ్రంథం రాశారని మరికొందరి వాదన. అలాగే మూడవ భార్య రెండవ కుమారుడు చనిపోగా సుత స్మృతి కూడా రాశారట. వీరి తర్వాత మాతృస్మృతి, సుతస్మృతి రాసిన మరో అరుదైన కవి నాయని సుబ్బారావు గారు. భార్యావియోగాన్ని దృష్టిలో ఉంచుకొని విశ్వనాథ సత్యనారాయణ "వరలక్ష్మి త్రిశతి" అనే స్మృతి కావ్యాన్ని వెలువరించారు. ఇంకా చాలామంది రాసి ఉండవచ్చు , కానీ అవి అంతగా ప్రఖ్యాతి పొందలేదు. ఆ మధ్యన కాంతమ్మ గారి జ్ఞాపకాలతో రావూరి భరద్వాజ రాసిన ఐదు సతీ స్మృతి కావ్యాలు దినచర్య లేదా జ్ఞాపకాల రూపంలో వెలువడినాయి.

వచనంలో చూస్తే వ్యాస రూపంలో వచ్చిన స్మృతి సాహిత్యం అక్కడక్కడ కనిపిస్తుంది. కానీ తెలుగు సాహిత్యంలో మొట్టమొదటిసారిగా స్మృతి సాహిత్యాన్ని నవలా రూపంలో వెలువరించిన ఘనత అంపశయ్య నవీన్ గారికి దక్కుతుంది. ఇది ప్రయోగం కోసం రాయలేదు. తనకు వచ్చిన, తనకు తెలిసిన ప్రక్రియ నవలా రచన కాబట్టి నవల రాశాడు. ఒకరికొకరు తోడు నీడగా 60 ఏళ్లు కలిసి కాపురం చేసిన భార్య, తన కళ్ళముందే అనారోగ్యంతో క్షీణించి మరణించడాన్ని చూసి తట్టుకోలేక గుండె పగిలిన భర్త ,ఆమెతో పరిచయం నుండి పెళ్లి ,పిల్లలు, కుటుంబం తాలూకు అన్ని పరిస్థితులను నెమరువేసుకొని తన "అనురాగ దీపం" ను తలచుకుంటూ, తన జ్ఞాపకాలకు నవలా రూపం కల్పించారు.

" నీకు పెళ్ళాం పుట్టింది రో..." అన్న మాటతో నవల ప్రారంభమవుతుంది. ఆమె తన మేనమామ కూతురు కావడం, ఆమె పుట్టినప్పటి నుండి మొదలుకొని ఆమె బాల్యం, చదువు, వ్యవహార దక్షతలను దగ్గరగా చూసిన రచయిత వాటిని వివరిస్తూ, ఏ పరిస్థితుల్లో ఎలా పెళ్లి చేసుకోవాల్సి వచ్చిందో చెబుతారు. చిరుద్యోగిగా భార్యతో సొంత ఇంటికి దూరంగా వెళ్లి కాపురం పెట్టడం, నవీన్ పెద్ద కొడుకుగా ఇంటి బాధ్యతలను నిర్వహించాల్సి రావడంతో, తన కుటుంబాన్ని పోషించుకోవడంలో చాలీచాలని జీతంతో సతమతమయ్యే రోజుల్లో, భార్యగా అనసూయ కొండంత అండగా నిలిచి అతనికి ధైర్యం చెబుతూ వ్యవహారాలను చక్కదిద్దేవారు. అతి మంచితనంతో, ఆదర్శవాదంతో ఎదురు దెబ్బలు తినే భర్తకు కర్తవ్య బోధ చేసేవారు. పిల్లలు, పిల్లల చదువులు, వారు సెటిల్ కావడం, కొత్త ఇంటి నిర్మాణం వీటన్నిటిని ముందు చూపుతో ఆలోచించి భర్తకు మార్గ నిర్దేశం చేసేవారు.


దేవానంద్ క్రాఫ్ తో అందగాడుగా కనిపించే నవీన్ రచయిత కావడం వలన ఎంతోమంది అమ్మాయిలు పరిచయం చేసుకోవడానికి తహతహలాడేవారు. కలం స్నేహం చేయడం, నేరుగా ఇంటికి రావడం చేస్తే అనసూయ గారే వారిని ఆప్యాయంగా చేరదీసేవారు. నవీన్ స్నేహం కోరుతూ వచ్చిన వారు అనసూయ గారి స్నేహితులుగా మారిపోయేవారు. చలం వీరాభిమాని అయిన నవీన్ ఆదర్శవాది, ఏక పత్నీవ్రతుడని గుర్తించిన అనసూయ గారు ఆయన మానాన ఆయన్ని వదిలేశారు.

అతి మంచితనం, ఆదర్శవాదం, ఊహా లోకాల్లో విహరించే నవీన్ గారికి ప్రాక్టికల్ గా ఆలోచించే అనసూయ గారు భార్యగా దొరకడం ఆయన అదృష్టం. భర్తను, ఇంటిని ,పిల్లలను చక్కదిద్దుకోవడంలో ,భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకోవడంలో ఆమె ముందుచూపు, వ్యవహార దక్షతల వలన రచయితగా నవీన్ గారికి బోలెడంత వెసులుబాటు దొరికింది. ఇప్పుడు ఆమె లేదన్న విషయాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె వియోగాన్ని ఆయన మాటల్లోనే చెప్పాలంటే "నా శరీరంలోని అణువులో అణువైపోయిన అనసూయ... నా కష్టాన్ని సుఖాన్ని సమంగా పంచుకున్న అనసూయ... అప్పుడప్పుడు మనస్పర్థలు వచ్చినా మళ్లీ త్వరగానే నాతో కలిసి పోయిన అనసూయ.. యవ్వనంలో నా తరతరాల శృంగార దాహాన్ని తీర్చిన అనసూయ... ఎంత కష్టమైనా, ఎంత తనకిష్టమైన నాకోసం తన బాధ్యతల్ని నెత్తిన వేసుకొని తీర్చిన అనసూయ... సొంతలాభం కొంత మానుకొని పొరుగువాడికి తోడ్పడాలనుకున్న అనసూయ.. ఆరు రోజుల పసిగుడ్డుగా ఉన్నప్పుడే తల్లిని కోల్పోయి, జీవితమంతా తల్లి ప్రేమ కోసం అర్రులు చాచిన అనసూయ.. బంధువుల కంటే ఎక్కువగా ఎంతో మంది స్నేహితులని సంపాదించుకున్న అనసూయ... ఎలాంటి భేదభావం లేకుండా మా డ్రైవర్ రామును తన చిన్న కొడుకుగా చేర్చుకున్న అనసూయ... అనసూయ నా జీవితంలో నుంచి వెళ్ళిపోయి నన్ను పైకి బతికున్నట్టు కనిపిస్తున్నా , అంతరంగంలో మరణించిన వాడిగానే చేసి పోయింది" అని వాపోతారు.

నాకు వరంగల్ అంటే నవీన్, నవీన్ కుటుంబమే జ్ఞాపకం వస్తారు. నవీన్ వరంగల్ లో ఏ సాహిత్య కార్యక్రమం తలపెట్టినా నన్ను వక్తగా పిలిచేవారు. వారే కాకుండా ఇతరత్రా జరిగే సాహిత్య కార్యక్రమాలు, సెమినార్లకు వెళ్లినా కూడా వారి ఇంటికి తప్పకుండా వెళ్లేవాడిని. నేను మొదటిసారిగా వెళ్ళినప్పుడు నవీన్ "అనసూయా! ఎవరు వచ్చారో చూడు. అశోక్ వచ్చాడు" అని పరిచయం చేయగా" రావయ్యా! నీ గురించి ఎప్పుడూ మీ సార్ చెబుతుంటాడు" అని ఆప్యాయంగా ఆహ్వానించారు. మాట్లాడిన పది నిమిషాలలో నా బెరుకునంతా పోగొట్టారు. భోజనం కొసరి కొసరి వడ్డిస్తూ మంచిగా తినాలె. ఇట్లా కొద్దికొద్దిగా తింటే ఎలా. ఇది వేసుకో అంటూ అతిథి మర్యాదలతో ఉక్కిరిబిక్కిరి చేసేవారు. మధ్యాహ్నం కాగానే నవీన్ తిని ఒక కునుకు తీయడానికి రూమ్ లోకి వెళ్లేవారు. నేను లైబ్రరీ రూమ్ లో కూర్చుంటే అనసూయ గారు వచ్చి, అవీ ఇవీ మాట్లాడుతూ తన పని చేసుకునేవారు. ఒక సోదరిగా, ఒక అమ్మగా ఆమె నా పట్ల చూపిన ఆదరాభిమానాలను నేను ఎప్పుడూ మర్చిపోలేను. వారే కాదు, వారి పిల్లలు కూడా నా పట్ల అత్యంత ఆత్మీయంగా వ్యవహరించేవారు. నేను వారి ఇంట్లో అనధికార కుటుంబ సభ్యుడిగా మారిపోయాను. ఆమె పేరు అనసూయ. మా అమ్మ పేరు అనసూయ. ఆ విషయం చెప్తే వారు ఆశ్చర్యపోయారు. తర్వాత సంతోషించారు.

వారు కొత్తగా కట్టుకున్న అపార్ట్మెంట్ లోకి రెండు సార్లు వెళ్లి వచ్చా. ఒకసారి నవీన్ గారు భార్యతో కలిసి బొల్లారంలో ఉన్న మా ఇంటికి వస్తే ..వారు మా ఇంటిని, మా ఆవిడని చూసి చాలా ముచ్చట పడిపోయారు. అనసూయ గారు మా ఆవిడతో మాట్లాడుతూ నన్ను బాగా చూసుకోమని చెబుతూ వెళ్లిపోవడం ఇంకా నాకు జ్ఞాపకం ఉన్నది. ఎప్పుడు నవ్వుతూ, ఆత్మీయంగా పలకరిస్తూ, ఇంట్లోకి ఆహ్వానించే అనసూయమ్మ గారి రూపు నా మనసులో శాశ్వతంగా ముద్రించుకుపోయింది. ఆమె లేని లోటు పూరించలేనిది. నా పరిస్థితి ఇలా ఉంటే, 60 ఏళ్ల దాంపత్య జీవితంలో తన కష్ట సుఖాలలో తోడు నీడగా నిలిచిన అనసూయ గారు లేని లోటు నవీన్ గారిని ఎంతగా కృంగదీసిందో మీరే ఊహించుకోండి. అందులోంచి కోలుకోవడానికి ఆమె జ్ఞాపకాలతో "అనురాగ దీపం" పేరుతో ఈ నవలను వెలువరించారు. వారు బాల్యంలో జరిగిన ప్రతి చిన్న విషయం, రెండు కుటుంబాల మధ్య జరిగిన ప్రతి సంఘటనను పదిల పరుచుకున్న తన జ్ఞాపకాలలో నుండి తవ్వి తీసి, వాటిని స్పష్టంగా వివరించడంలో చూపిన శ్రద్ధను, నిజాయితీని పాఠకుడు తప్పకుండా గుర్తించ గలుగుతాడు. సతీస్మృతిలో వచ్చిన అరుదైన వచన గ్రంథం గా ఇది ఎప్పటికీ నిలిచిపోతుంది.


- కె పి అశోక్ కుమార్




## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.

43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# టీవీ రంగానికి త్వరలో అవార్డులు

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటన.. టెలివిజన్ కార్మికులకు అండగా ఉంటాం: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మహా:** బేగంపేట టూరిజం ప్లాజాలో తెలంగాణ టెలివిజన్ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ టెలివిజన్ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో 24 క్రాఫ్ట్స్ సినీ కార్మికుల కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ చీఫ్‌మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, సినీ పరిశ్రమకు చెందిన 38 సంఘాల ప్రతినిధులు, ప్రముఖ నటీనటులు, సినీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సినీ కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై విశ్లేషణాత్మక చర్చ జరిగింది. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో టీవీ రంగం వారికి కూడా అవార్డులు ప్రకటించబోతున్నట్లుగా తెలిపారు. చిత్రపురి సమస్యను తప్పక పరిష్కరిస్తానని, చిన్న నటులకు కూడా అందులో అవకాశం కల్పించాలనే నిర్ణయం తీసుకున్నట్లుగా ఆయన తెలిపారు. మీరు ఓటు రూపంలో మాకు అండగా ఉండండి, మీకు కావలసిన సహాయాన్ని నేను భరోసా ఇస్తున్నట్లుగా కోమటిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చిత్ర పరిశ్రమ రావడానికి కృషి చేసింది కాంగ్రెస్ పార్టీనే, ప్రోత్సహించింది కూడా కాంగ్రెస్ పార్టీనే అన్నారు. సినీ కార్మికులు, టీవీ రంగం నటీనటులు, టెక్నికల్ నిపుణులు అందరికీ మా ప్రభుత్వం అండగా ఉంటుందని, మీకు ఏ సమస్య ఉన్నా నా దగ్గరికి రావచ్చని ఆయన స్పష్టం చేశారు. సినీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, జూబ్లీహిల్స్ అభివృద్ధి చెందాలంటే నవీన్ యాదవ్‌ను గెలిపించాలని మీ కుటుంబ సభ్యునిగా అడుగుతున్నట్లుగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.





టెలివిజన్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో టెలివిజన్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ముఖ్యంగా కార్మికుల ఆర్థిక, సామాజిక భద్రతా సమస్యలపై తమ ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, వారి పట్ల సీఎం రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా ఉన్నారని మంత్రి వివరించారు. సినీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళల అండగా ఉంటుంది : మహేష్ కుమార్ గౌడ్ మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అందరిదని, సినీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. నవీన్ యాదవ్ ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటాడని పార్టీ టికెట్ ఇచ్చిందని, జూబ్లీ హిల్స్ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ గెలిచి తీరాల్సిన అవశ్యకత ఉందన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణ ఖజానును కొల్లగొట్టిందని, వాటాల పంపకాల తేడాతో ఆయన కూతురు కవిత రోడ్డున పడ్డారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# రేవంతుద్దీన్ గా మారిన సీఎం

## ఉప ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీ సాధిస్తుంది.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడగాల్సిన పరిస్థితి లేక మతాన్ని రాజకీయ ఆయుధంగా మార్చుకుని ఓట్లు అడుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు విమర్శించారు. ఒకవైపు తమ పార్టీని మతోన్మాద పార్టీ అంటూ ముద్ర వేస్తూ, మరోవైపు వారే మతం పేరుతో ఓట్లు అడుగడం సిగ్గుచేటున్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ప్రచారం పూర్తిగా మత ఆధారితమేనని, అభివృద్ధి గురించి మాట్లాడాల్సింది పోయి, మత ప్రేరేపణతో ప్రచారం చేసిందన్నారు. డిప్యూటీ సీఎం క్రిస్టియన్ సమాజాన్ని ఉద్దేశించి క్రిస్టియన్లు అందరూ కాంగ్రెస్‌కే ఓటేయాలి, బీజేపీకి కాదు అని పిలుపునివ్వడం మత ప్రేరేపణ అవుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అంటేనే ముస్లిం, ముస్లిం అంటేనే కాంగ్రెస్ అని ప్రచారం చేశారు. కాంగ్రెస్‌లో ఉన్నవాళ్లు అందరూ ముస్లింలుగా మారిపోయారా, మిగతా వర్గాల ఓట్లు వారికి అవసరం లేదా అంటూ నిలదీస్తూ రేవంత్ రెడ్డి ఇప్పుడు రేవంతుద్దీన్ గా మారిపోయినట్లు ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక బిజెపిపై బురద చల్లడానికి కాంగ్రెస్ నేతలు కుట్రలు చేస్తూ కేంద్రం తెలంగాణకు ఏమి ఇవ్వలేదని తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పై విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి కిషన్ రెడ్డి, బిజెపి ఫోబియా పట్టుకుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు తెలంగాణ అభివృద్ధి కోసం రూ.12 లక్షల కోట్లు కేటాయించిందని స్పష్టం చేశారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు రూ.719 కోట్లు, చర్లపల్లి స్టేషన్‌లో కొత్త టెర్మినల్ నిర్మాణం, హైదరాబాద్, కాచిగూడ, లింగంపల్లి, బేగంపేట, హాఫీజ్‌పేట్, హైటెక్ సిటీ, మలక్‌పేట్ రైల్వే స్టేషన్లను వందల కోట్ల రూపాయాలతో ఆధునీకరిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ మదర్ ఆఫ్ లైస్ అబద్ధాలతో ప్రజలను మోసం చేసే పార్టీ. కాంట్రాక్టర్లు, కమీషన్లే కాంగ్రెస్ పాలనకు ప్రతీక అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో ఎరువుల కొరత, ఉద్యోగులకు జీతాల ఆలస్యం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో అనేక వర్గాల ప్రజలకు అన్యాయం చేశారు. తక్కువ కాలంలో ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వం మరొకటి లేదని ఎద్దేవా చేశారు.

**సీఎం కుర్చీ కాపాడుకునేందుకు వారం రోజులు సీఎం ప్రచారం: బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి**

జూబ్లీహిల్స్ ఎన్నికలో ఓడిపోతే తన సీఎం కుర్చీ పోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారం రోజులుగా ప్రచారం చేస్తూ ఉనికి కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు. కేసీఆర్‌లక్ష కోట్ల అవినీతి సొమ్ము కక్కిస్తామని పీసీసీ హోదాలో గొప్పలు పలికి అధికారం చేపట్టిన తరువాత బీఆర్ఎస్ తోకుమ్మక్కై వారి అవినీతి వాటాలు పంచుకునే పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి పై విమర్శలు చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనన్నారు. మూసీ ప్రాజెక్ట్ విషయంలో బీజేపీ అడ్డుపడుతోందని చెప్పే రేవంత్ రెడ్డి పేదల ఇళ్లకు రక్షణగా నిలిచింది బీజేపీనే అన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. పేదల కన్నీళ్లపై రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనే కుట్రలను ఎండగట్టమన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో బీదల సొమ్ము దోచుకుంటూ వారి జీవితాలను ఆగం చేస్తోంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన సలకం చెరువులోని ఓవైసీ ఫాతిమా కాలేజీని ఎందుకు కూల్చడం లేదన్నారు. మూసీ పునరుద్ధరణకు ఎలాంటి రోడ్‌మ్యాప్ ఉంది, డీపీఆర్ లేకుండా ప్రాజెక్టు ఖర్చులు ఎలా అంచనా వేశారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో హైడ్రా పేరుతో ఎప్పుడు ఎవరి ఇండ్లు కూల్చుతారోననే భయం ప్రజల్లో నెలకొంది. కాంగ్రెస్ అంటే ఎంఐఎం, ఎంఐఎం అంటే కాంగ్రెస్ గా మారింది. గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేసిన అభ్యర్థిని ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేయిస్తున్నారు. బీజేపీ నాయకుల మధ్య ఎటువంటి విభేదాలు లేవు. కానీ కాంగ్రెస్ సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం చేస్తూ, బీజేపీ నాయకులు ప్రచారంలో పాల్గొనడం లేదంటూ తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తోంది. ఇలాంటి అబద్ధపు ప్రచారం మానుకోవాలని హెచ్చరించారు.

# రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాల్సిందే...

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో లోకల్, నాన్ లోకల్ కాదు పంచాయితీ.. సీఎం రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాల్సిందే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని యూసుఫ్‌గూడలో నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్ షోలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. సరిగ్గా 30 రోజుల నుంచి ప్రతి రోజు బీఆర్ఎసోళ్లు, కాంగ్రెసోళ్లు మీ ఇంటికి వస్తున్నరు. మాకే ఓటేయండి అని దండం పెట్టి అడుగుతున్నరు. మీకు దండం పెట్టి ఒక్కటే చెబుతున్నా.. గుండె మీద చేయి వేసుకుని ఒక్కటే ఆలోచన చేయండి.. పదేండ్లు కేసీఆర్ పాలనలో పరిస్థితులు బాగుండేనా..? కాంగ్రెస్ పాలనలో బాగున్నదా..? అని ఆలోచిచండి. ఏమన్నా లాభమైందా ఆలోచించండి. పదేండ్లు కేసీఆర్ నాయకత్వంలో పేదలను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు. హైదరాబాద్, తెలంగాణలో సర్వతోముఖాభివృద్ధి సాధించారు. అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిచాం అని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లో 42 ఫ్లై ఓవర్లు కట్టుకున్నాం. లింకు రోడ్లు వేసుకున్నాం. బస్తీ దవఖానాలు ఏర్పాటు చేసుకున్నాం. సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా కాపాడుకున్నాం. వేల పరిశ్రమలు తెచ్చుకున్నాం.. లక్షల కొద్ది ఉద్యోగాలు సృష్టించుకున్నాం. వ్యాపారాలు విస్తరించాయి. పదేండ్లు సంతోషంగా ఉన్నాం. కేసీఆర్ ఉన్నప్పుడు భూముల ధర ఎట్ల ఉండే.. ఇప్పుడు ఎట్ల అయిందో ఆలోచిచండి.. పేదల ఆస్తులు హారతి కర్పూరంలాగా కరిగిపోతున్నాయి ఈ కాంగ్రెస్ పాలనలో అని కేటీఆర్ పేర్కొన్నారు. నేను లోకల్ అని అంటున్నడు కాంగ్రెస్ అభ్యర్థి. లోకల్, నాన్ లోకల్ కాదు పంచాయితీ.. ఎన్ని అబద్ధాలు, గ్యారెంటీలు చెప్పి అధికారంలోకి వచ్చిందో మీరు గుర్తుకు తెచ్చుకోండి. తులం బంగారం వచ్చిందా...? రెండున్నర వేలు వచ్చాయా..? 4 వేల పెన్షన్ వచ్చిందా..? అయినా కూడా మళ్లీ ఓట్లు వేద్దామా..? రెండేండ్లలో ఒక్క మంచి పని చేయలేదు.. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. ఇవాళ అభివృద్ధి చేస్తామంటే నమ్ముదామా..? కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డి బుద్ధి చెబుదామా..? కాంగ్రెస్ అభ్యర్థి లోకల్ అయి ఉండొచ్చు.. కానీ ప్రజలను మోసం చేసింది రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కాబట్టి బుద్ధి చెప్పాల్సిందే అని కేటీఆర్ అన్నారు.



# నవీన్ యాదవ్ గెలుపు తథ్యం

## ప్రఫుల్ రాంరెడ్డి టియుజేఏసీ టీజేసి అధ్యక్షులు



**భువనగిరి, మహా :** జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు తథ్యమని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ప్రఫోల్ రామ్ రెడ్డి అన్నారు ఆయన ఆదివారం ప్రచారం చివరి రోజు లో భాగంగా ప్రతి ఇంటిని తిరుగుతూ నవీన్ యాదవ్ గెలుపు కోసం టీజేఏసీ. అహర్నిశలు కష్టపడుతుందని ఆయన అన్నారు నవీన్ యాదవ్ గెలుపును ఎవరు ఆపలేరని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు కోరే సాయిరాం ఎర్ర జాన్సన్ ఏ యాదగిరి శంకర్రావు సుచరిత రంగారెడ్డి నరసింహ పాల్గొన్నారు

# ఓటమి భయంతో కాంగ్రెస్ జిమ్మిక్కులు

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శలు

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ కపట నాటకాలు ఆడుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను తట్టుకోలేక రకరకాల జిమ్మిక్కులు ఆడుతున్నారని అన్నారు. జూబ్లీహిల్స్‌లో ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు కాబట్టి.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చి ఎన్నికల్లో గెలవాలని కుయుక్తులు చేసిందని ఆరోపించారు. కానీ ఈ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ఆశాభంగం తప్పదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ లేకపోతే ముస్లింలు లేరని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయని కొప్పుల ఈశ్వర్ తెలిపారు. దీనిపై ముస్లిం వర్గాల్లో తీవ్రమైన చర్చ జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఎన్నికల ప్రచారం కోసం వెళ్తుంటే ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వస్తున్నాయని అన్నారు. ప్రజలకు చేసేందేమీ లేక.. చెప్పుకోవడానికి ఏమీలేక తిట్ల పురాణంతో సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షోలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంతసేపు కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను నిందించడం తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత చెప్పుకునే విధంగా ఏదీ చేయలేదని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి హైడ్రా దెబ్బ తగులుతుందని కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఓటమి భయంతోనే ఇప్పుడు రకరకాల జిమ్మిక్కులు చేస్తున్నారని అన్నారు. ఓటర్లను కొనే ప్రయత్నంలో భాగంగా ఒక్కో ఓటుకు రూ.5వేలు ఇచ్చే పనిలో మంత్రులు బిజీగా ఉన్నారని అన్నారు. ఎన్ని చేసినా ఈ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని స్పష్టం చేశారు. ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.






# వచ్చే నెలలో ఐపీఎల్ వేలం!

**ఢిల్లీ, మహా:** ఐపీఎల్ 2026 సందడి మొదలు కాబోతుంది. ఈ సీజన్ వేలం ప్రక్రియ డిసెంబర్‌లో జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 15న వేలం నిర్వహించాలని బీసీసీఐ యోచిస్తోందని వార్తలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. నవంబర్ 15లోపు అన్ని ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను బీసీసీఐకి సమర్పించాల్సి ఉంటుందని సమాచారం.గతంలో రెండు సీజన్ల మాదిరిగానే ఈ సారి కూడా గల్ఫ్ దేశాల్లోనే ఐపీఎల్ వేలం నిర్వహిస్తారని ప్రచారం జరిగింది. దీనికి సంబంధించి ఫ్రాంచైజీలకు కూడా తెలియజేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ సారి ఐపీఎల్ ఆక్షన్ భారత్‌లోనే ఉంటుందని తాజాగా కథనాలు వెలువడుతున్నాయి. మరి ఏ నగరంలో వేలం నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేదు. గత రెండు ఆక్షన్‌లను వేరే దేశంలో నిర్వహించారు. 2023లో దుబాయ్, 2024లో సౌదీ అరేబియాలో వేలం ప్రక్రియ జరిపారు. ఐపీఎల్ 2026 వేలం ప్రక్రియ గురించి బీసీసీఐ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.






# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు

## మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మొయినాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి నాయకులు



**మొయినాబాద్ మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపొందడం ఖాయమని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో సబితా రెడ్డితో పాటు మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి నాయకులు పాల్గొని ప్రచార ర్యాలీలో బీఆర్ఎస్ కు పార్టీకి ఓటు వేసి గెలిపించాలని.. ప్రజలను అభ్యర్ధించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని అన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు డ్రామాలు చేస్తూ.. పేద ప్రజలను మోసం చేస్తున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సంక్షేమ పథకాలు సాధ్యమైందని మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలంటే పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి జూబ్లీహిల్స్ అభ్యర్థి సునీత గోపీనాథ్ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మార్మోగిన ఆలయం

## ఆదివారం బుగ్గ జాతరకు పోటెత్తిన భక్తజనం

- స్వామివారి సేవలో 30 వేలకు పైగా భక్తులు
- సీఐ మధు బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ
- సీసీ కెమెరాలతో ఆలయ పరిసరాలపై నిఘా





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కార్తీక పౌర్ణమి సందర్భంగా బుగ్గ రామలింగేశ్వర స్వామి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. మంచాల మండలం ఆరుట్ల గ్రామ పరిధిలోని, శ్రీశ్రీశ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వివిధ జిల్లాల నుంచి ఈ యొక్క జాతరకు తండోపతండాలుగా చేరుకున్న భక్తులతో ఎటు చూసినా భక్తులు కిక్కిరిసి పోవడంతో, బుగ్గ రామలింగేశ్వర దేవాలయం శివనామస్మరణతో మార్మోగింది. ఆదివారం ఒకే రోజు దాదాపు ముప్పై వేల మందికి పైగా భక్తులకు రామ లింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తజన సంద్రోహరంగా మారింది. కనుచూపు మేరలో భక్తులతో నిండిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గుండంలో స్నానమాచరించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మరి కొంతమంది భక్తులు స్వామి వారి సన్నిధానంలో సత్యనారాయణ స్వామి వ్రతాలతో పాటు తులసి కోట, శివలింగం వద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సమీపంలో ఉన్న కబీర్ దాస్ మందిరంలోని నాగన్న పుట్ట, నర్సింహ బాబా సమాదితో పాటు కబీర్‌దాస్ మందిరంలో పూజలు నిర్వహించారు. మంచాల సీఐ మధు, ఎస్సైలు నాగేశ్వరరావు, వంశీ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తున్నారు. పోలీసులతో పాటు సీసీ కెమెరాల నడుమ జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.

**స్వామివారిని దర్శించుకున్న 30 వేల మంది భక్తులు...**

తూర్పు రంగారెడ్డి జిల్లాలో, శ్రీశ్రీశ్రీ బుగ్గ రామలింగేశ్వర ఆలయం, దక్షిణ కాశీగా కొలువుదీరిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆరుట్ల గ్రామంలో దక్షిణ కాశీగా చెప్పుకునే బుగ్గ జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో జిల్లాల నలుమూలల నుంచి భక్తులు 30 వేలకుపైగా హాజరయ్యారని దేవాలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. భక్తులు శివయ్యను దర్శించుకుని ఆహ్లాదకర వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు చేశారు.

# ఆమనగల్లులో ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు





**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు పట్టణంలో పీర్ల మసీద్ కాలనీలో మహబూబ్ సుభాని దర్గా వద్ద ఆదివారం గ్యార్మీ షరీఫ్ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. అంజుమానే గులమే ముస్తఫా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు పట్టణ ముస్లిం మైనార్టీ నాయకులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహబూబ్ సుభాని దర్గా వద్ద నుండి జెండాతో పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో జెండాను ప్రతిష్టించి మత గురువు మౌలానా వాహేద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు సలాం, దువా ,చేపట్టారు. అంజుమానే గులామే ముస్తఫా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సోదరులు అలీబెగ్, చోటే బెగ్ ,సయ్యద్ ఖలీల్, మహ్మద్ మాసూమ్, జబ్బార్, బాబా షర్ఫుద్దీన్, సయ్యద్ ఖలీల్, నయీం, రజాక్, అఫ్జల్, షఫీ ఉల్లా, ఎజాస్, అలీమ్, కలీం, అప్సర్, హాఫీజ్, నాసర్, అంజుమనే గులా మే కమిటీ సభ్యులు అక్రమ్ బేగ్, బాబా, బాబా, అజహర్, అబ్బాస్, అమీర్ పాషా, అసద్, అంజద్, సోహెబ్, సోహెల్ ,గౌస్, రావుఫ్,పాషా, ముధసిర్, ముజంమిల్, ఆబేద్, ముబాషిర్, రిజ్వాన్, తదితరులు ఉన్నారు

# మార్కండేయ స్వామి ఆలయంలో కార్తీక శోభ



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని సిర్సన్న గ్రామంలో నూతనంగా నిర్మించిన మార్కండేయ స్వామి ఆలయంలో పలు పూజలు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రుద్రాభిషేకంతో పాటు కార్తీక దీపోత్సవము, రుక్మిణి కళ్యాణము,మహా హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి పసుపు ,కుంకుమ అర్చన చేసి మొక్కులు తీర్చుకున్నారు. మార్కండేయ స్వామి దర్శనం కోసం మహిళలు భారీగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటాలాడింది. గ్రామంలో మొదటి సారిగా నూతనంగా నిర్మించిన మార్కండేయ ఆలయంలో కార్తీక దీపోత్సవము,రుద్రాభిషేకం, రుక్మిణి కళ్యాణం ఘనంగా జరుపుకున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మార్కండేయ స్వామి వారి ఆశీస్సులు గ్రామ ప్రజలపైన ఉండాలని సుఖ సంతోషాలతో ప్రతి ఒక్కరు జీవించాలని వేడుకున్నారు.

# పల్లకి ఊరేగింపు



**ఆదిలాబాద్ మహా :** బేల మండలంలోని కాప్సీ బి గ్రామంలో నానాజీ మహారాజ్ పుణ్యతిథి వేడుకలను శనివారం గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. దీంతో పాటు ప్రతి సంవత్సరం బాజీరావ్ మహారాజ్ పుణ్యతిథి వేడుకలను కూడా జరుపుకుంటారు. గ్రామస్తులు,శ్రీ నానాజీ మహారాజ్ శిష్యులు కలిసి గ్రామంలో ప్రధాన వీధులు గుండా పల్లకి ఊరేగింపు చేపట్టారు. భజన కీర్తనలు, భక్తి పాటలతో శోభాయాత్ర నిర్వహించారు. కాప్సి గ్రామంలో గత కొన్ని సంవత్సరాల నుండి నానాజీ మహారాజ్ పుణ్యతిథి వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నామని భక్తులు అన్నారు.నానాజీ మహారాజ్ 129వ పుణ్యతిథి వేడుకల కోసం గ్రామం నుండే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. నానాజీ మహారాజ్ యొక్క ఆశీస్సులు కాప్సి గ్రామం పైన ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని వేడుకున్నారు. అనంతరం మహాన్నదానం ఏర్పాటు చేశారు.

# పంట కొనుగోలు కేంద్రాలు

ఆదిలాబాద్ మహా : జిల్లా రైతుల కోసం మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న, సోయాబీన్ పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ రాజార్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణం, భీంపూర్, ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, ఇంద్రవెల్లి, నార్నూర్ ప్రాంతాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా, ఆదిలాబాద్ పట్టణం, జైనథ్, బేల, భీంపూర్, ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్ ప్రాంతాల్లో సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు తమ పంటలను శుభ్రపరచి, తేమశాతం మొక్కజొన్నకు 14శాతం సోయాబీన్‌కు 12 శాతం మించకుండా ఎండలో ఆరబెట్టి, గ్రామాలవారీగా కేటాయించిన తేదీల్లో సంబంధిత కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు లేని పంట కొనుగోలు చేయబడదని స్పష్టం చేశారు. రైతులు తమ పంట నాణ్యతపై అనుమానం ఉంటే ముందుగా కొంత నమూనా తీసుకెళ్లి సంబంధిత మార్కెట్ యార్డులో పరీక్షించుకోవచ్చని, ప్రమాణాలు సరిపోతేనే పంటను తీసుకురావాలని సూచించారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని కలెక్టర్ కోరారు. కొనుగోలు కేంద్రాల వివరాలు, సందేహాల నివృత్తి కోసం రైతులు 6300001597 నంబర్ ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.



# గొర్లకాపరుల ధర్నా

**జన్నారం మహా :** తమను దుర్భాషలాడుతు చిత్రహింసలకు గురి చేస్తున్న ఎప్బీవో ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గొర్లకాపరులు రోడ్డెక్కారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రము లోని రహదారిపై రాస్తారోఖో చేపట్టారు. దీంతో ఇరు వైపులా భారీగా ట్రాఫిక్ స్థంభించి పోయింది. ఫారెస్ట్ అధికారులు వేధింపులు అధికమయ్యాయని వారు వాపోయారు. పశువులను అడవిలోకి మేపేందుకు వెలుతుంటే అటవీశాఖ బీట్ ఆఫీసర్ లాల్ బాయి తమని బూతులు తిడుతూ దాడికి పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. తక్షణమే ఆమెను సస్పెండ్ చేయడమే కాకుండా పశువులను అడవిలోకి మేతకు అనుమతించాలని డిమాండ్ చేశారు.

## టీజీపీఈఈడిఏ అధ్యక్షులుగా
# జి.గురువయ్య ఎన్నిక

### అదిలాబాద్ డివిజన్ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ ఎన్నిక

**మంచిర్యాల, మహా :** తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీపీఈఈడిఏ) అదిలాబాద్ అధ్యక్షులుగా జి గురువయ్య ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టీజీపీఈఈడిఏ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. అధ్యక్షులుగా జి గురువయ్య పి అండ్ ఈఐ మంచిర్యాల స్టేషన్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం హరి చెన్నూర్, ఉపాధ్యక్షులుగా డి గంగారెడ్డి, పి ఎస్ ఎఫ్ ఐ ఆదిలాబాద్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర వైద్య పి ఎల్ ఈ ఎస్ ఐ. ఆదిలాబాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి వెంకట రమణ, పి అండ్ ఈ ఎస్ ఐ మంచిర్యాల, జాయింట్ సెక్రటరీగా జుల్ఫికర అహ్మద్ పి అండ్ ఈ ఎస్ ఐ ఇచ్చోడ, (ట్రెజరర్ గా కే అభిషేకర్ పి అండ్ ఈ ఎస్ ఐ నిర్మల్ స్టేషన్, ఈసీ సభ్యులుగా రంగస్వామి, వి రవి, జి శారద, పి రాజేశ్వర లను ఎన్నుకున్నట్లు అధ్యక్షులు గురువయ్య వెల్లడించారు.

# డ్రైనేజికి శాశ్వత పరిస్కారం చెయ్యాలి

### డ్రైనేజి శుద్ధిలేక నిలిచిన మురుగు నీరు.. వ్యాధుల భారిన పడుతున్న ప్రజలు
### సమస్యని పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి



**మహాదేవపూర్ బ్యూరో:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలనీ ఎస్సి కాలనీ వాటర్ ట్యాంక్ సమీపంలో వాడుకంలో లేని డ్రై నేజిలోకి రోడ్ నీ పగలగొట్టి మురుగు నీరుని పంపిస్తున్నారనీ కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ డ్రై నేజిలోకి మురుగు నీరు చేరుతే బయటికి పోనికి మార్గం లేదని డ్రై నేజి సమీపంలో ఉన్న ఇంకో డ్రై నేజికి అనుసంధానం చేసి వృధా నీరుని బయటికి పంపించే వరకు ఇందులోకి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని పలుమార్లు పంచాయతీ కార్యదర్శి కి కోరిన నిమ్మకు నీరేత్తినట్టు ఉందని.ఈ డ్రైనేజ్ లో చేరిన మురుగు నీరు బయటికి వెళ్లననీకిమార్గంలేక నిలిచిపోవడంతో సమీపంలో ఉన్న ఇండ్లలోనీ ప్రజలకు జ్వరాలు వస్తున్నాయని. మురుగు నీరు బయటికి వెలెందుకు శాశ్వత పరిష్కారం చేసే వరకు వాడకంలో లేని ఈ డ్రై నేజ్ లోకి వృధా నీరుని పంపించవద్దని కాలనీ వాసులు కోరుతున్నారు.




## ఆదివాసి జర్నలిస్టుకు
# ఆర్థిక సాయం

**సిర్పూర్ మహా :** జర్నలిస్టుల హక్కుల సాధనే ప్రధాన లక్ష్యమని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ తెలిపారు. ఆదివారం జైనూర్ మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయంలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ సభ్యత్వ పత్రాలను అందజేశారు.జర్నలిస్టులు ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తెచ్చి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని వారు సూచించారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు, అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడానికి యూనియన్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పట్నాపూర్‌కు చెందిన ఆదివాసి రిపోర్టర్ ఆత్రం రాముకు వైద్యసాయం నిమిత్తం ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అడప సతీష్, అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రకాష్ గౌడ్, సీనియర్ జర్నలిస్టులు నరేందర్, షేక్ జమిల్, అన్నరావు, రాందాస్, రామేశ్వర్, ఆసిఫ్, ప్రకాష్, రవి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు
# పద్మశాలీల సంపూర్ణ మద్దతు


### ఆత్మీయ సమ్మేళనంలో చిప్ప వెంకటేశ్వర్లు నేత



**వరంగల్ మహా;** హైదరాబాదు లోని ఎర్రగడ్డలో ఏర్పాటు చేసిన పద్మశాలీ ఆత్మీయ సభ లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు పద్మశాలి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో చిప్ప వెంకటేశ్వర్లు నేత పాల్గొని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు పద్మశాలి సమాజం సంపూర్ణ మద్దతు ఉంటుందని అలాగే అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పద్మశాలీలను కోరడం జరిగింది. ఈ సందర్భంగా దాసు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట అధ్యక్షులు గూడూరి శ్రీనివాస్ టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీశ్వర్ టీపీసీసీ మహిళా నాయకురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న
# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

**సమస్యల సాధనకై కమిషనర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి**
**గుర్రం నరసింహ, జిల్లా అధ్యక్షులు**



**వలిగొండ, మహా :** చేనేత రంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని జిల్లా అధ్యక్షులు గుర్రం నరసింహ అన్నారు ఆదివారం వలిగొండ లో కరపత్రాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా నూలు రంగులు ముడి సరుకుల పైనే కాక నేసిన బట్టల పై కూడా జిఎస్టిపేరుతో పన్నులు వేసి పదేళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన అన్నారు అనేక సంక్షేమ పథకాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేయడమే కాక చేనేత హైండ్లు బోర్డు కూడా ఎత్తివేసిందని అన్నారు రాష్ట్రంలో చేనేత కార్మికులకు రుణమాపీ ప్రకటించి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తుందని నిధులు కూడా విడుదల చేసినట్లు ప్రకటన చేసిన ప్రభుత్వం ఇప్పటికి అమలు చేయలేదని అన్నారు నేతన్న భరోసా కాగితాలకి పరిమితమైందని పై సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న జరిగే కమిషనర్ కార్యాలయం ముందు హైదరాబాద్ లో జరిగే మహాధర్నను చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు రాష్ట్ర నాయకులు వనం ఉపేందర్ నాయకులు దొంత శంకరయ్య హైట్ పాముల కుమార్ బోడ ఈశ్వర్ గుంటి రమేష్ ముడిదొడ్ల శేఖర్ బోడ సౌజన్య ముడిదొడ్ల కిరణ్ కుమార్ నర్మదా తదితరులు పాల్గొన్నారు..



## నిద్రిస్తున్న కూలీ
## తలపై నుండి వెళ్లిన కాంక్రీట్
# మిక్సింగ్ మిల్లర్

### పాట్నా బీహార్ కు చెందిన కూలి మృతి
### వాహన డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో ఊరు మందమర్రి సబ్ స్టేషన్ దగ్గర విద్యుత్తు లైన్ మరమ్మత్తులు నిర్వహిస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన కాచు ప్రసాద్ (43) తలపై నుండి కాంక్రీట్ మిక్సింగ్ మిల్లర్ వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం పొద్దుపోయాక వెలుగు చూసింది. స్థానిక సీఐ శశిధర్ రెడ్డి కథనం ప్రకారం మందమర్రి లో సోలార్ విద్యుత్తు లైను మరమ్మత్తు పనులు నిర్వహించేందుకు పాట్నా, బీహార్ ప్రాంతం నుండి కొంతమంది కూలీలు వచ్చారని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం కాంక్రీట్ విధులు ముగించుకొని భోజనం చేసిన కాచు ప్రసాద్ ఆ పక్కనే ఉన్న పత్తి చేనులో అలసిపోయి పడుకున్నాడని వెల్లడించారు. ఆ తర్వాత అక్కడికి కాంక్రీట్ మిక్సింగ్ మిల్లర్ వాహనం వచ్చినట్లు చెప్పారు. ఈ క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో బీహార్ కూలి కాచు ప్రసాద్ తలపై నుండి వెళ్లిందాని వివరించారు. తమకు సమాచారం అందగానే ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. అలాగే మృతిని కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు వెల్లడించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ను తీసుకొని కేసు దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు.

# 2019లో భర్తకు విడాకులు..

## ఆరేళ్లుగా లక్షల కోట్లు విరాళం

డబ్బు సంపాదించే కొద్దీ ఇంకా పోగుచేసుకుందాం అనే ఆలోచన కొందరికి, సంపాదించే దాంట్లోనే నలుగురికి సహాయం చేసేద్దాం అనుకునే మనుషులు ఇంకొంతమంది. ఇలాంటి కోవకు చెందినవారిలో ఒకరు జెఫ్ బెజోస్ మాజీ భార్య 'మెకెంజీ స్కాట్'. 2020 నుంచి ఈమె 19 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విరాళంగా ఇచ్చినట్లు.. ఫోర్బ్స్ నివేదించింది. 2019లో మెకెంజీ స్కాట్ & జెఫ్ బెజోస్ విడాకులు తీసుకున్నప్పుడు.. అమెజాన్‌లో ఆమె వాటా దాదాపు 4 శాతం. ఎందుకంటే ఆమె ఈకామర్స్ దిగ్గజం స్థాపన, ప్రారంభ కార్యకలాపాలలో కీలక పాత్ర పోషించింది. ఆ సమయంలో ఈ నాలుగు శాతం వాటా దాదాపు 139 మిలియన్ షేర్లకు సమానం. 2019 నుంచి స్కాట్ తన వాటాలో 42 శాతం.. దాదాపు 58 మిలియన్ షేర్ల విలువను విరాళంగా ఇచ్చారు. మొత్తం మీద 19.25 బిలియన్ డాలర్లను (రూ.1.70 లక్షల కోట్లు) విరాళంగా ఇచ్చినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. దీనికోసం ఆమె అమెజాన్‌లో తన వాటాను అమ్ముతూనే ఉంది. భారీ మొత్తంలో విరాళాలు అందిస్తున్నప్పటికీ.. మెకెంజీ స్కాట్ నికర ఆస్తుల విలువ 35.6 బిలియన్ డాలర్లు (రూ. 3.15 లక్షల కోట్లు)గా ఉంది.



**మెకెంజీ స్కాట్ విరాళాలు**

మెకెంజీ స్కాట్.. హోవార్డ్ విశ్వవిద్యాలయానికి 80 మిలియన్ డాలర్లు, వర్జీనియా స్టేట్ విశ్వవిద్యాలయానికి 50 మిలియన్ డాలర్లు, ఆల్కార్న్ స్టేట్ విశ్వవిద్యాలయానికి 42 మిలియన్ డాలర్లు, స్పెల్మాన్ కళాశాలకు 38 మిలియన్ డాలర్లు, యునైటెడ్ నీగ్రో కళాశాల నిధి (UNCF)కి 70 మిలియన్ డాలర్లు, ఆఫ్రికన్ అమెరికన్ కల్చరల్ హెరిటేజ్ యాక్షన్ ఫండ్‌కు 40 మిలియన్ డాలర్లు, సెంటర్ ఫర్ డిజాస్టర్ ఫిలాంత్రోపీకి 60 మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చారు.

# దుబాయ్‌లో ప్రపంచ తెలుగు ఐటీ మహాసభలు: ఎప్పుడంటే?

ప్రపంచ తెలుగు ఐటీ మహా సభలు 2025 డిసెంబర్ 12 నుంచి 14 వరకు యుఎఇలోని.. ప్రతిష్ఠాత్మక దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి (డబ్ల్యూటీఐటీసీ) అధికారికంగా ప్రకటించింది. మూడు రోజుల ఈ అంతర్జాతీయ మహా సభలు డిసెంబర్ 12న ప్రత్యేకమైన నెట్‌వర్కింగ్ ఈవెంట్ & యాచ్ పార్టీతో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత డిసెంబర్ 13, 14 తేదీల్లో ప్రధాన సమావేశాలు, డబ్ల్యూటీఐటీసీకు నూతన నాయకత్వం వహించేవారు ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుంది. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించబడే "ప్రపంచ తెలుగు ఐటీ మహా సభలు" ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తలు, వ్యాపారవేత్తల అత్యంత ప్రాధాన్యమైన ప్రపంచ సమావేశాల్లో ఒకటిగా అవతరించింది. 2023లో సింగపూర్‌లో నిర్వహించిన గత మహాసభలో 100 దేశాలను ప్రాతినిధ్యం వహించిన 3,000 మందికి పైగా ప్రతినిధులు పాల్గొని, సాంకేతిక రంగంలో తెలుగు వృత్తిపరుల ప్రపంచంలో వివిధ దేశాల్లో జరుగుతున్న మార్పులు, అధునాతన సాంకేతికతపై పెద్ద ఎత్తున్న చర్చించారు. 2025లో దుబాయ్‌లో జరగబోయే ఈ మహా సభ విజయ వారసత్వాన్ని కొనసాగిస్తూ, 2027లో జరగబోయే తదుపరి ద్వైవార్షిక ఎడిషన్‌కు వేదికను ఏర్పాటు చేస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా 100కి పైగా దేశాల నుంచి తెలుగు సాంకేతిక నిపుణులు, వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు ఒక వేదికపైకి రానున్నారు. ఈ మహాసభ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), బ్లాక్‌చైన్, క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్ డిజైన్, క్లౌడ్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, అగ్రిటెక్, ఫిన్‌టెక్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ వంటి అత్యాధునిక రంగాల్లో జరుగుతున్న పురోగతులను ప్రదర్శించనున్నారు. యూఏఈ ప్రభుత్వానికి చెందిన మంత్రులు, రాజ కుటుంబ ప్రతినిధులు, విధాననిర్మాతలు అలాగే ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా నుంచి వచ్చే అంతర్జాతీయ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఈ కార్యక్రమానికి తమ అధికారిక మద్దతును ప్రకటించాయి. రెండు రాష్ట్రాలు కూడా ఈ కాన్ఫరెన్స్‌లో తమ ప్రధాన సాంకేతిక, స్టార్టప్ అండ్ ఆవిష్కరణ కార్యక్రమాలను ప్రదర్శించనున్నాయి. రెండు రాష్ట్రాల నుంచి ముఖ్యాధికారులు, మంత్రులు పాల్గొని, తమ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ రోడ్‌మ్యాప్స్ & ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలను వివరించనున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా భారతదేశం ఒక గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా ఉన్న స్థాయిని మరింత బలపరచనుంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి సిద్ధంగా ఉండేందుకు, డబ్ల్యూటీఐటీసీ దుబాయ్ లీడర్‌షిప్ టీమ్ ఇటీవల దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ఒక ప్రణాళికా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో 40 మందికిపైగా కోర్ సభ్యులు, నిర్వాహకులు పాల్గొని, ఈ మహాసభకు సంబంధించిన లాజిస్టిక్స్ & అమలు ప్రణాళికలను తుది రూపమిచ్చారు. ఈ సమావేశానికి డబ్ల్యూటీఐటీసీ అంతర్జాతీయ సమన్వయకర్తలు, యూఏఈ చాప్టర్ నాయకులు, ప్రముఖ ఐటీ నిపుణులు హాజరయ్యారు. ఈ సమావేశం ద్వారా భారతదేశం వెలుపల జరగబోయే అతిపెద్ద తెలుగు సాంకేతిక సదస్సు కోసం అధికారికంగా ప్రారంభమైనట్లు గుర్తించబడింది. ఈ కార్యక్రమంలోని ప్రధాన ఆకర్షణగా 2026-2028 కాలానికి నియమించబడిన డబ్ల్యూటీఐటీసీ గ్లోబల్ లీడర్‌షిప్ టీమ్ గ్రాండ్ ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సాంకేతిక నాయకత్వం, సహకారంలో ఒక కొత్త యుగానికి నాందిగా నిలవనుంది. సింగపూర్‌లో పొందిన అపార విజయానంతరం, ప్రపంచవ్యాప్తంగా తెలుగు సాంకేతిక నిపుణులను ఏకైకంగా కలపడానికి మా తదుపరి స్థానం దుబాయ్ అవుతుందని డబ్ల్యూటీఐటీసీ చైర్మన్ సందీప్ కుమార్ మక్తాలా తెలిపారు. ఈ మహాసభ కేవలం సాంకేతికత గురించి కాదు, ఇది తెలుగు గౌరవం, ఆవిష్కరణ, ప్రపంచ వేదికపై నాయకత్వం గురించి అని ఆయన పేర్కొన్నారు. డబ్ల్యూటీఐటీసీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సాంకేతిక నిపుణులు, వ్యాపారవేత్తలు, స్టార్టప్‌లు, పరిశోధకులు, అకాడెమిక్‌లు, వ్యాపార నాయకులు ఈ చారిత్రక కార్యక్రమంలో పాల్గొనడానికి ఆహ్వానిస్తున్నది. ప్రతినిధులు, ప్రసంగకారులు, స్పాన్సర్లు, భాగస్వాముల కోసం నమోదులు ఇప్పుడు ప్రారంభం అయ్యాయి.



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అంబానీ

భారతదేశంలో అత్యంత సంపన్నుడు, రిలియన్స్ అధినేత ముఖేష్ అంబానీ ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేంకటేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులతో.. భక్తులకు మా నిరాడంబరమైన సేవను కొనసాగిస్తూ, తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కొరకు ఒక ఆధునికమైన, అత్యున్నత ప్రమాణాలతో కూడిన వంటశాలను (కిచెన్) నిర్మించనున్నట్లు తెలియజేయడానికి మేము ఎంతో గౌరవంగా భావిస్తున్నామని ఈ సందర్భంగా అంబానీ పేర్కొన్నారు. ఈ పవిత్రమైన కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానములు (TTD) భాగస్వామ్యంతో మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంపూర్ణ సహకారంతో చేపడుతున్నాము. ఈ కొత్త వంటశాల అధునాతన ఆటోమేషన్‌ను కలిగి ఉంటుంది. ఇది ప్రతిరోజూ రెండు లక్షల కంటే ఎక్కువ మందికి కావలసిన భోజనాలను తయారుచేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. తద్వారా, ప్రతి భక్తుడికి అత్యంత భక్తి, పరిశుభ్రత, శ్రద్ధతో తయారుచేసిన పౌష్టికాహార అన్నప్రసాదం ప్రేమతో అందించడం జరుగుతుంది. తిరుమల.. విశ్వాసం, కరుణ & నిస్వార్థ సేవకు శాశ్వత చిహ్నంగా నిలుస్తోంది. ఈ ప్రయత్నం ద్వారా, TTD దేవాలయాలన్నింటికీ అన్నసేవ సంప్రదాయాన్ని విస్తరించాలనే ఏపీ సీఎం ఉన్నత ఆశయానికి సహకరించడం మాకు అదృష్టంగా భావిస్తున్నాము. వేంకటేశ్వర స్వామివారికి సేవ చేయడం, 'ఏ భక్తుడూ ఆకలితో ఉండకూడదు' అనే తిరుమల దివ్య సంకల్పంలో ఒక చిన్న భాగం కావడం మాకు లభించిన భాగ్యం. ముఖేష్ అంబానీ.. కేరళలోని త్రిస్సూర్ జిల్లా, గురువాయూర్ పట్టణంలో ఉన్న గురువాయూర్ శ్రీ కృష్ణ దేవాలయాన్ని కూడా సందర్శించారు. ఆయన ఆ దేవాలయానికి రూ. 15 కోట్ల రూపాయలను విరాళంగా అందించారు.



# బంగారం ఇప్పుడు కొనాలా.. ఇంకొన్ని రోజులు వేచి చూడాలా?

దసరా, దీపావళి వంటి పండుగలు ముగిసినప్పటికీ.. పసిడికి ఏ మాత్రం డిమాండ్ తగ్గడం లేదు. గత నెలతో పోలిస్తే.. ఈ నెలలో గోల్డ్ రేటు కొంత తగ్గడం కూడా బంగారం కొనుగోళ్లు పెరగడానికి కారణమయ్యాయి. అయితే ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైపోయింది. కాబట్టి గోల్డ్ ఇప్పుడు కొనాలా?, ఇంకొన్ని రోజులు వేచి చూడాలా? అని చాలామందిలో ఓ సందేహం ఏర్పడింది. 2025 నవంబర్ 1నుంచి డిసెంబర్ 14వరకు భారతదేశంలో సుమారు 48 లక్షల వివాహాలు జరగనున్నాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ వెల్లడించింది. ఈ సీజన్‌లో సుమారు రూ. 6.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని తన నివేదికలో పేర్కొంది. ఇందులో ప్రధానంగా గోల్డ్ అమ్మకాలు భారీగా ఉంటాయని స్పష్టం చేసింది. మన దేశంలో పెళ్లిళ్లకు భారీగా ఖర్చు చేస్తారు. ఇక పెళ్లి అనగానే బంగారం కొనుగోలు తప్పకుండా ఉంటుంది. స్థాయిని బట్టి.. ప్రతి ఒక్కరూ గోల్డ్ కొనడం జరుగుతుంది. దీంతో పసిడి అమ్మకాలు గణనీయంగా పెరుగుతాయి. ఈ సమయంలో బహుశా బంగారం ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇక బంగారం ఇప్పుడు కొనాలా?, ఇంకొన్ని రోజులు వేచి చూడాలా? అనే విషయానికి వస్తే.. గోల్డ్ కొనుగోలు చేయడం అనేది ఒక వ్యక్తి బడ్జెట్ మీద ఆధారపడి ఉంటుంది. అయితే ఇది పెళ్లిళ్ల సీజన్.. ధరలు ఇప్పుడు ఎక్కువగా ఉంటాయి, తరువాత తగ్గుతాయి.. అనుకోవడంలో ఎలాంటి ఖచ్చితత్వం లేదు. ఎందుకంటే పెళ్లిళ్ల సీజన్ తరువాత తప్పకుండా తగ్గుతాయని ఊహించలేము. పెరిగే అవకాశాలు కూడా ఉండొచ్చు. దీనికి ప్రధాన కారణం డిమాండ్. అంటే.. బంగారం అనేది సురక్షితమైన ఆస్తి కాబట్టి కొనుగోలు చేసేవాళ్లు కొంటూనే ఉంటారు. డిమాండుకు తగ్గ సరఫరా ఉన్నప్పుడు.. ధరలు తగ్గొచ్చు, డిమాండ్ ఎక్కువగా ఉండి, సరఫరా తక్కువ ఉంటే?, ధరలు పెరుగుతాయి. కాబట్టి చేతిలో డబ్బు ఉన్నప్పుడు, బంగారం కొనాలని నిర్ణయించుకున్నప్పుడు.. కొనేయడమే ఉత్తమం. శనివారం మన దేశంలో బంగారం ధరల విషయానికి వస్తే.. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1,22,020 వద్ద.. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,11,850 వద్ద ఉంది. శుక్రవారం ధరలతో పోలిస్తే.. శనివారం ధరల్లో ఎలాంటి మార్పు లేదని తెలుస్తోంది.





## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

# జపాన్‌లో భారీ భూకంపం

## సునామీ హెచ్చరికలు జారీ

**టోక్యో:** జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. శనివారం ఉదయం సంభవించిన భారీ భూకంపం ఆ దేశవ్యాప్తంగా భయాందోళనకు కారణమైంది. రిక్టర్ స్కేల్‌పై 6.7 తీవ్రతతో నమోదైన ఈ భూకంపం తూర్పు తీర ప్రాంతాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. జపాన్ వాతావరణ శాఖ ప్రకారం, భూకంప కేంద్రం హొక్కైడో ప్రాంతానికి సమీపంలో సముద్ర మట్టానికి దిగువన నమోదైంది. భూకంపం అనంతరం జపాన్ వాతావరణ శాఖ తూర్పు తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికను జారీ చేసింది. ప్రజలను తక్షణమే లతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. భూకంపం ప్రభావంతో హొక్కైడో, టోహోకు, మియాగి వంటి ప్రాంతాల్లో భవనాలు కంపించాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిచిపోయినట్లు సమాచారం. ఇప్పటివరకు ప్రాణ నష్టం, ఆస్తినష్టంపై అధికార సమాచారం లేదు. అయితే, పలు రైలు సేవలు నిలిచిపోయాయి. విమానయాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భూకంపం తీవ్రతతో జపాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. రెస్క్యూ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బందిని రంగంలోకి దించింది. ప్రజలకు అవసరమైన సహాయం అందించింది. జపాన్ వాతావరణ శాఖ ప్రకారం.. సముద్ర మట్టానికి దగ్గరగా భూకంప కేంద్రం ఉండటంతో సునామీ వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. తీర ప్రాంతాల్లో 1 మీటరు వరకు అలలు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించింది. ఈ భూకంపంపై యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే కూడా స్పందించింది. భూకంప తీవ్రతను ధృవీకరించిన యూఎస్‌జీఎస్, భవిష్యత్తులో మరిన్ని ప్రకంపనలు సంభవించే అవకాశం ఉందని తెలిపింది. ఈ ఘటనపై మరిన్ని వివరాలు అధికారికంగా వెలువడే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను పాటించాలని కోరుతున్నారు. జపాన్ వంటి భూకంప ప్రభావిత దేశాల్లో ఇటువంటి ప్రకృతి విపత్తులకు ముందస్తు చర్యలు తీసుకోవడం సాధారణమే అయినా, ఈ స్థాయి తీవ్రతతో వచ్చిన భూకంపం ప్రజలలో ఆందోళన కలిగిస్తోంది.



# మునీర్‌కు మరింత పవర్.. పాక్ సర్కార్ కీలక నిర్ణయం!

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ ప్రభుత్వం త్రివిధ దళాలను ఏకీకృత కమాండ్ కిందికి తీసుకు వచ్చేందుకు వీలుగా 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్'అనే కొత్త పోస్టును సృష్టించింది. ఇందుకోసం షెహబాజ్ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243లో ప్రతిపాదించిన మార్పులతో 27వ రాజ్యాంగ సవరణ బిల్లును శనివారం సెనేట్‌లో ప్రవేశపెట్టింది. దీని ప్రకారం.. ఆర్మీ చీఫ్‌ను, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్‌ను ప్రధానమంత్రి సిఫారసు మేరకు అధ్యక్షుడు నియమిస్తారు. అనంతరం, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ ప్రధానితో చర్చించిన తర్వాత నేషనల్ స్ట్రాటజిక్ కమాండ్ అధిపతిని నియమిస్తారు. సైన్యం, వైమానిక, నౌకా దళాల మధ్య సమన్వయం కోసం సీడీఎఫ్ అధిపతిగా ఉంటారు. కాగా, ఈ నెల 28న పదవీ విరమణ చేయనున్న ఆసిఫ్ మునీర్‌ను కొత్తగా సృష్టిస్తోన్న సీడీఎఫ్‌గా నియమించనున్నట్లు పాకిస్తాన్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అదే జరిగితే మునీర్‌కు పాక్ సైన్యంపై మరింత పట్టు పెరుగుతుంది. ఆయనకు మరిన్ని పవర్ వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్తాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. భారత్ దాడుల కారణంగా పాకిస్తాన్ తీవ్రంగా నష్టపోయింది. పాక్ ఆర్మీకి భారత్ చుక్కలు చూపించింది. అనంతరం, దాడుల నుంచి తేరుకున్న పాక్.. తమ సైన్యంపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే పాకిస్తాన్ ప్రభుత్వం ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌ను ఫీల్డ్ మార్షల్ హోదాకు పదోన్నతి కల్పించింది. తద్వారా ఆయన దేశ చరిత్రలో ఈ పదవికి ఎదిగిన రెండవ అత్యున్నత సైనిక అధికారిగా నిలిచారు. అప్పటి నుంచి షెహబాజ్ ప్రభుత్వం మునీర్‌ను హైలైట్ చేస్తోంది.



# అమెరికాలో ఇద్దరు భారత గ్యాంగ్‌స్టర్లు అరెస్ట్

**న్యూఢిల్లీ:** విదేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న భారత దేశానికి చెందిన మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్లలో ఇద్దరిని అరెస్టు చేయడంలో భారత భద్రతా సంస్థలు విజయాన్ని సాధించాయి. హర్యానా పోలీసులతోపాటు భద్రతా సంస్థ అధికారులు జార్జియాలో వెంకటేష్ గార్గ్‌ను అరెస్టు చేయగా, భాను రాణాను అమెరికాలో అరెస్టు చేశారు. ప్రస్తుతం భారతదేశానికి చెందిన 25 మందికి పైగా గ్యాంగ్‌స్టర్లు దేశం వెలుపల ఉన్నారు. వీరు క్రిమినల్ సిండికేట్‌లను నడుపుతున్నారని 'ఎన్‌డీటీవీ' తన కథనంలో పేర్కొంది. గార్గ్, రాణాలను అరెస్టు చేయడానికి సాగించిన ఆపరేషన్‌లో పలు కీలక విషయాలు వెల్లడయ్యాయని సమాచారం. గార్గ్.. హర్యానాలోని నారాయణ్‌గఢ్ నివాసి. ప్రస్తుతం జార్జియాలో ఉంటున్న గార్గ్‌పై భారతదేశంలో 10 కి పైగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అతను హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ, తదితర రాష్ట్రాలకు చెందిన యువతను ప్రలోభపెట్టిన తన బృందంలో నియమించుకుంటాడు. గురుగ్రామ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) నేత హత్య తరువాత అతను జార్జియాకు పారిపోయాడు. గార్గ్ ప్రస్తుతం విదేశాలలో ఉంటున్న గ్యాంగ్‌స్టర్ కపిల్ సంగ్వాన్‌తో కలిసి దోపిడీ సిండికేట్‌ను నడుపుతున్నాడు. కాగా భాను రాణా .. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం కలిగి ఉంటూ, చాలా కాలంగా అమెరికాలో నివసిస్తున్నాడు. కర్నాల్ నివాసి అయిన రాణా చాలా కాలంగా నేర ప్రపంచంలో చురుగ్గా ఉన్నాడు. అతనిపై పలు కేసులు నమోదయ్యాయి. రాణా నేర నెట్‌వర్క్ హర్యానా, పంజాబ్, ఢిల్లీ వరకు విస్తరించి ఉంది. పంజాబ్‌లో జరిగిన గ్రెనేడ్ దాడి దర్యాప్తులో అతని పేరు బయటకు వచ్చింది.



# బంగ్లాకు పాక్ యుద్ధనౌక..

## ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్?




**ఢాకా:** దాయాది పాకిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయి. బంగ్లాదేశ్ తాత్కాలిక సారథిగా మహమ్మద్ యూనస్ అధికారం చేపట్టిన తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయి. పాకిస్తాన్‌కు చెందిన కీలక నేతలు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా పాకిస్తాన్‌కు చెందిన నేవీ యుద్ధనౌక చిట్టగాంగ్ ఓడరేవుకు చేరుకుంది. పాక్ నేవీకి చెందిన యుద్ధనౌక, PNF SAIF.. నాలుగు రోజుల సౌహార్ద పర్యటన నిమిత్తం బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ ఓడరేవుకు చేరుకుంది. ఈ విషయాన్ని బంగ్లా నేవీ సోషల్ మీడియా పోస్ట్‌లో ప్రకటించింది. బంగ్లాదేశ్ నేవీ పాక్ యుద్ధనౌకకు హృదయపూర్వక స్వాగతం పలికింది. అయితే, 1971 తర్వాత పాక్ యుద్ధనౌక బంగ్లాదేశ్ సందర్శించడం ఇదే తొలిసారి. ఇది పాక్ కొత్త ఎత్తుగడగా భారత్ భావిస్తోంది. ఆపరేషన్ సిందూర్‌తో ఎదురుదెబ్బ తగిలిన తర్వాత పాక్.. బంగ్లాదేశ్ ద్వారా మన దేశాన్ని చుట్టుముట్టాలని కుట్ర పన్నుతోందని సమాచారం. ఇదిలా ఉండగా.. కెప్టెన్ షుజాత్ అబ్బాస్ రాజా నతృత్వంలోని జుల్ఫికార్‌క్లాస్ ఫ్రిగేట్ పిఎన్ఎస్ సైఫ్ (FFG253) సద్భావన పర్యటనలో భాగంగా బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ పోర్టుకు యుద్ధనౌక చేరుకుంది . పాకిస్తాన్ నేవీ చీఫ్ అడ్మిరల్ నవీన్ అష్రఫ్ ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి అధికారిక పర్యటన నిమిత్తం బంగ్లాదేశ్‌లో ఉన్న సమయంలో ఈ సందర్శన జరిగింది. మరోవైపు.. గత అక్టోబర్ ప్రారంభంలో పాక్ సైన్యంలో రెండో అత్యున్నత సైనిక కమాండర్ జనరల్ సాహిర్ షంషాద్ మీర్జా కూడా బంగ్లాదేశ్‌ను సందర్శించారు. మీర్జా తాత్కాలిక ప్రభుత్వ అధిపతి ముహమ్మద్ యూనస్, ఆర్మీ చీఫ్‌తో సమావేశమయ్యారు.

# కుప్పకూలిన హెలికాప్టర్..



దక్షిణ రష్యాలో ఆర్మీకి చెందిన ఓ హెలికాప్టర్ అదుపుతప్పి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. యుద్ధ విమానాల విడి భాగాలు తయారు చేసే కంపెనీకి చెందిన సిబ్బందితో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తూ డాగేస్తాన్‌లోని కాస్పియన్ సముద్ర తీరంలో నిర్మాణంలో ఉన్న అతిథి గృహంపై కూలిపోగా.. మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో హెలికాప్టర్‌లోని ఏడుగురు ప్రయాణికుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం.. సాంకేతిక లోపం కారణంగానే జరిగిందని ప్రాథమిక సమాచారం. ఈ ఘటనకు సంబంధించి.. వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ హెలికాప్టర్‌లో కిజ్ల్యార్ ఎలక్ట్రో మెకానికల్ ప్లాంట్‌కు చెందిన సిబ్బంది ఉన్నట్లు రష్యా మంత్రి యారోస్లావ్ గ్లాజోవ్ వెల్లడించారు. సుఖోయ్, మిగ్ అటాక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లకు అవసరమైన గ్రౌండ్ కంట్రోల్, డయాగ్నస్టిక్ సిస్టమ్స్‌ను కిజ్ల్యార్ ఎలక్ట్రో మెకానికల్ ప్లాంట్ తయారుచేస్తుంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో హెలికాప్టర్ టెయిల్ విరిగిన తర్వాత పైలట్ దాన్ని నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. పైలట్.. అత్యవసర ల్యాండింగ్ కోసం సముద్రం వైపు దాన్ని మళ్లించేందుకు ప్రయత్నించినప్పటికీ, హెలికాప్టర్ నిర్మాణంలో ఉన్న భవనంపై పడి మంటల్లో కాలిపోయింది. ఈ ఘటనపై రష్యా ఫెడరల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ విచారణ చేపట్టింది.. kA226 హెలికాప్టర్.. రెండు ఇంజన్లతో పనిచేసే తేలికపాటి హెలికాప్టర్.. రష్యాలో రవాణా, యుటిలిటీ అవసరాల కోసం ఉపయోగిస్తారు. ఇది గరిష్టంగా ఏడుగురు ప్రయాణికులను తీసుకెళ్లగలదు.



# పారితోషికం.. రష్మిక ఏం ఆలోచించిందో?

హీరోహీరోయిన్లు అన్నాక సినిమాలు చేస్తారు. రెమ్యునరేషన్ తీసుకుంటారు. కానీ గత కొన్నాళ్లలో కొందరు సెలబ్రిటీలు.. ముందు మూవీస్ చేస్తున్నారు. రిలీజ్ తర్వాత పారితోషికాలు అందుకుంటున్నారు. పాన్ ఇండియా లేటెస్ట్ సెన్సేషన్ రష్మిక కూడా 'ద గర్ల్‌ఫ్రెండ్' విషయంలో ఇలానే చేసినట్లు తెలుస్తోంది. మూవీ విడుదలకు ముందు ఓ ఈవెంట్‌లో నిర్మాత ధీరజ్ కూడా ఇదే విషయాన్ని చెప్పారు. రిలీజ్ తర్వాత తనకు డబ్బులివ్వాలని రష్మిక చెప్పిన సంగతి బయటపెట్టారు. 'గర్ల్‌ఫ్రెండ్' రీసెంట్‌గానే (నవంబరు 07న) థియేటర్లలోకి వచ్చింది. పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. రోజురోజుకీ కలెక్షన్ నంబర్స్ పెరుగుతున్నాయి. దీంతో రష్మిక రెమ్యునరేషన్ ఎంత తీసుకుందా అనే విషయం మరోసారి చర్చకు వచ్చింది. ప్రస్తుతం పాన్ ఇండియా వైడ్ తెలుగు, హిందీ సినిమాల్లో నటిస్తున్న రష్మిక.. ఒక్కో ప్రాజెక్ట్ కోసం రూ.56 కోట్ల వరకు అందుకుంటోందట. 'గర్ల్‌ఫ్రెండ్' కోసం మాత్రమే రూ.3 కోట్లు చాలానే అందట. ఇప్పుడీ విషయం చర్చనీయాంశమైంది. కొన్నిసార్లు కొన్ని సినిమాలు.. ఆయా హీరోహీరోయిన్లకు కిక్ ఇస్తుంటాయి. బహుశా రష్మికకు కూడా 'గర్ల్‌ఫ్రెండ్'తో ఇలాంటి సంతృప్తి లభించినట్లు ఉంది. అందుకే సాధారణంగా తీసుకునే దానికంటే తక్కువగానే తీసుకుందని మాట్లాడుకుంటున్నారు. దీంతో రష్మిక మరోసారి టాక్ ఆఫ్ ద టౌన్ అయిపోయింది. అలానే ప్రస్తుతం ఎక్కడ చూసినా రష్మిక పేరే వినిపిస్తుంది. ఎందుకంటే గత ఏడాది కాలంలో ఈమె నుంచి ఐదు వైవిధ్య భరిత సినిమాలు రావడం విశేషం.

'ద గర్ల్‌ఫ్రెండ్' విషయానికొస్తే.. భూమా(రష్మిక) ఎం.ఏ లిటరేచర్ స్టూడెంట్. తండ్రి(రావు రమేశ్)ని ఒప్పించి హాస్టల్‌లో చేరుతుంది. కానీ కాలేజీలో చేరిన తొలిరోజే భూమా, విక్రమ్ (దీక్షిత్ శెట్టి) ప్రేమలో పడతారు. విక్రమ్‌ని దుర్గ(అను ఇమ్మాన్యుయేల్) కూడా ఇష్టపడుతుంది. కానీ విక్రమ్ మాత్రం భూమానే ప్రేమిస్తాడు. రిలేషన్‌లో మానసికంగా, శారీరకంగా చాలానే దూరం వెళ్తారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ.





# అభ్యంతరకర సీన్.. ఓకే కదా?
## అని 17 సార్లు అడిగాడు: నటి

కన్నడ నటుడు గుల్షన్ దేవయ్య.. హిందీలో సినిమాలు చేసుకుంటూ బాలీవుడ్‌లో స్థిరపడిపోయాడు. ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చిన 21 ఏళ్ల తర్వాత తన మాతృభాషలో సినిమా చేసే ఛాన్స్ వరించింది. అదే కాంతార: చాప్టర్ 1. ఈ మూవీలో విలన్‌గా మంచి క్రేజ్ తెచ్చుకున్న గుల్షన్ ప్రస్తుతం 'థెరపీ షెరపీ' అనే వెబ్ సిరీస్ చేస్తున్నాడు. ఇందులో మరాఠీ నటి గిరిజ ఓక్ నటిస్తోంది.

**ముందే చెప్తారు**

తాజాగా ఆమె సిరీస్ షూటింగ్‌లో ఎదురైన ఓ సంఘటన గురించి చెప్పుకొచ్చింది. గిరిజ మాట్లాడుతూ.. సిరీస్ అయినా, సినిమా అయినా కొన్ని అభ్యంతరకర సన్నివేశాలు చిత్రీకరించేటప్పుడు కొందరు సెట్‌లోనే ఉంటారు. నటీనటులు ఇబ్బందిపడకుండా వాళ్లు తగు జాగ్రత్తలు తీసుకుంటారు. సీన్ ఎలా ఉండబోతుంది? ఏం చేయాలి? అనేది వాళ్లు క్లియర్‌గా వివరిస్తారు.

**ఏ ఇబ్బందీ రానివ్వలేదు**

అయినప్పటికీ కొన్నిసార్లు సడన్‌గా డైలమాలో పడుతుంటాం. అయితే కొందరు నటులతో పనిచేసినప్పుడు అసౌకర్యం అనేదే ఉండదు. అలాంటివారిలో గుల్షన్ ఒకరు. మేము దుస్తులు ధరించే ఉన్నాం, అక్కడ చెడుగా ఏమీ లేదు. అప్పటికీ అతడు మీకు ఓకే కదా? ఇబ్బందేం లేదుగా అని 1617 సార్లు అడిగాడు. ఆయన చూపించిన గౌరవం, కేరింగ్ నాకెంతో నచ్చింది. తనవల్లే ఎటువంటి ఇబ్బంది లేకుండా సీన్ పూర్తి చేశాం అని గిరిజ ఓక్ చెప్పుకొచ్చింది.



# శోభిత టాలెంట్ చూస్తే ముచ్చటేస్తుంది
## నాగచైతన్య

టాలీవుడ్‌లో కంటే బాలీవుడ్‌లో ఎక్కువ గుర్తింపు సంపాదించుకుంది శోభిత ధూళిపాళ. దీంతో మొదట్లో చాలామంది ఈ అమ్మాయిని ముంబై బ్యూటీ అనుకున్నారు. కానీ, ఈమె అచ్చ తెలుగమ్మాయి అని, తనది విశాఖపట్నం అని తర్వాత అందరికీ తెలిసొచ్చింది. తెలుగు కూడా చాలా స్పష్టంగా మాట్లాడుతుంది. ఆమె మాట్లాడుతుంటే తన భర్త, హీరో నాగచైతన్య కూడా అలా చూస్తూ ఉండిపోతాడట!

### అక్కడ స్పీడు.. ఇక్కడేమో

చై మాట్లాడుతూ.. ముంబైలో సిటీ అమ్మాయిలా చాలా దూకుడుగా, ఆత్మస్మైర్యంతో కనిపిస్తూ ఉంటుంది. వైజాగ్‌లో తన ఇంటికొస్తే మాత్రం పల్లెటూరి పిల్లలా మారిపోతుంది. సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తుంది. అలాగే తెలుగు చాలా చక్కగా మాట్లాడుతుంది. ఎంతలా అంటే తను నాకు తెలుగు నేర్పించేంత గొప్పగా మాట్లాడుతుంది, అంత టాలెంట్ ఉంది అని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

### తెలుగు భాషపై ప్రేమ

శోభిత తన పెళ్లి ఫోటోలు షేర్ చేసిన సమయంలో అచ్చ తెలుగులో క్యాప్షన్ ఇచ్చింది. మాంగల్యం తంతునానేనా మమ జీవన హేతునా అంటూ శ్లోకాన్ని రాసింది. అక్కడే తనకు తెలుగు భాషపై ఎంత ప్రేముందో అర్థమవుతోంది. అలాగే ట్రెడిషనల్‌గా ముస్తాబవడం కూడా శోభితకు ఎంతో ఇష్టం. అఖిల్ పెళ్లిలో పెద్దగా హంగూ ఆర్భాటలకు పోకుండా చాలా సింపుల్‌గా ముస్తాబైంది. ఫుల్ స్లీవ్స్ బ్లౌజుతో చీర కట్టి, మెడలో సింపుల్‌గా ఒక నగ అలరించుకుని నుదుటన పెద్ద బొట్టుబిళ్ల పెట్టుకుంది.

### పెళ్లి

అక్కడే శోభిత సింప్లిసిటీ కనిపిస్తోంది. దీపావళి పండక్కి కూడా పర్పుల్ డ్రెస్‌లో రెడీ అయి దీపాలు వెలిగించింది. కాగా నాగచైతన్య.. గతంలో సమంతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కానీ, ఎంతోకాలం కలిసుండలేకపోయారు. 2021లో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత చై.. శోభితతో ప్రేమాయణం సాగించాడు. వీరిద్దరూ 2024లో పెళ్లి చేసుకున్నారు. మరోవైపు సమంత కూడా దర్శకుడు రాజ్ నిడిమోరుతో డేటింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.



# జయకృష్ణ సినిమా..




ఘట్టమనేని కుటుంబం నుంచి మరో నటుడు చిత్రపరిశ్రమలోకి వస్తున్నారు. ఈమేరకు అధికారికంగా ప్రకటన వచ్చేసింది. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్‌బాబు కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని గ్రాండ్ లాంచ్ కానున్నారు. తన బాబాయి మహేష్ బాబు ఆశీస్సులతో తొలి సినిమాకు సిద్ధం అవుతున్నాడు. ఆర్ఎక్స్ 100, మంగళవరం చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అజయ్ భూపతి (Ajay Bhupathi) ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను వైజయంతి మూవీస్‌తో అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. గతంలో సూపర్ స్టార్ కృష్ణతో కల్ట్ బ్లాక్‌బస్టర్ అగ్నిపర్వతం చిత్రాన్ని నిర్మించి, తరువాత రాజకుమారుడుతో ప్రిన్స్ మహేష్ బాబును తెలుగు సినిమాకు పరిచయం చేసిన అశ్విని దత్, ఇప్పుడు ఘట్టమనేని నుంచి మరో వారసుడిని వెండితెరకు పరిచయం చేస్తున్నారు. అజయ్ భూపతితో కలిసి మూడవ తరం స్టార్ జయ కృష్ణ ఘట్టమనేనితో ఒక మంచి ప్రేమకథను అశ్విని దత్ నిర్మిస్తున్నారు. జయ కృష్ణ ఇప్పటికే నటనతో పాటు ఫైట్స్, డ్యాన్స్ వంటి ఇతర నైపుణ్యాలలో శిక్షణ పొందాడు. ఈ ప్రాజెక్ట్ ఇదే నెలలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. టైటిల్ వంటి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. తెలుగు సినిమాలో ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఒక ప్రేమకథను ఈ మూవీలో చూపించనున్నట్లు తెలుస్తోంది. జయ కృష్ణ తండ్రి రమేశ్ బాబు అనారోగ్యం కారణంగా 2022లో కన్నుమూశారు. దీంతో ఆయన కుమారుడి కెరీర్‌ను చూడాల్సిన బాధ్యత మహేష్ బాబు మీద ఉంది.



# రెహమాన్ కన్సర్ట్.. పెద్ది టీమ్ సందడి

ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్.. హైదరాబాద్‌లో శనివారం రాత్రి కన్సర్ట్ నిర్వహించారు. తన లైవ్ ఫెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి రెహమాన్ అభిమానులు, సంగీత ప్రియులు వేలాది తరలివచ్చారు. ఈ ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ కన్సర్ట్‌లో రెహమాన్.. తమిళ, హిందీ పాటలు ఆలపించారు. అలానే తెలుగులోని కొన్ని సాంగ్స్ కూడా పాడారు. 'పెద్ది' హీరోహీరోయిన్ల రామ్ చరణ్, జాన్వీ కపూర్‌తో పాటు దర్శకుడు బుచ్చిబాబు సందడి చేశారు. ఇక స్క్రీన్ పై 'పెద్ది' నుంచి ఈ మధ్యే రిలీజైన 'చికిరి' పాటని ప్లే చేయడం విశేషం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com